

మర్రిచెట్లపాలెం వద్ద శ్మశానంలో డంపు చేసిన గ్రానైట్ స్లర్రీ



పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కుతూ సంపాదనే పరమావధిగా చీమకుర్తి ప్రాంత గ్రానైట్ పరిశ్రమ యజమానులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. వారు ఇష్టారీతిన మైనింగ్ చేస్తుండటం ప్రజలకు శాపంగా మారింది. క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధుల బారినపడి రోగాలతో సహజీవనం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వాతావరణాన్ని కాలుష్యమయం చేస్తున్నా, సంబంధిత అధికార యంత్రాంగంలో చలనం లేకపోవడం గమనార్హం. గ్రానైట్ వ్యర్థాలను రహదారికి ఇరువైపులా, నివాసప్రాంతాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో, ఆఖరికి శ్మశానాల్లో సైతం డంపింగ్ చేస్తుండడం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారింది.

రామతీర్థం వద్ద ధూళితో నిండిన కర్నూలు రహదారి, పక్కన చెట్లు

కాలుష్య కాటు

చీమకుర్తి ప్రాంతంలో ఇష్టారాజ్యంగా మైనింగ్ కార్యకలాపాలు

వ్యాధుల కోరల్లో చిక్కుకున్న ప్రజలు

నివాసాల మధ్య, వాగుల్లో స్లర్రీ డంపింగ్‌తో భూగర్భ జలాలు కలుషితం

- నిబంధనలకు తిలోదకాలిచ్చిన గ్రానైట్ పరిశ్రమలు
- పర్యావరణానికి భారీగా తూట్లు
- క్యాన్సర్, ఊపిరితిత్తులు తదితర జబ్బులతో విలవిల
- ఆదాయమే పరమావధిగా యజమానుల పోకడ
- చేష్టలుడిగిన అధికార యంత్రాంగం

చీమకుర్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి శివారు నుంచి మర్రిచెట్లపాలెం ముసి ఒడ్డు వరకూ కర్నూలు రోడ్డుకు ఇరువైపులా దాదాపు పదికిలోమీటర్ల మేర ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలున్నాయి. వాటికి అనుబంధంగా పాలిషింగ్ యూనిట్స్, కంకర మిల్లులు విస్తరిం

చాయి. జిల్లాలో పశ్చిమ ప్రకాశానికి ఈ ప్రాంతం నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇలాంటి కీలక ప్రాంతంలో పర్యావరణ నిబంధనలకు తిలోదకాలిస్తూ గ్రానైట్‌క్వారీల యాజమాన్యాలు కార్యకలాపాలు నిర్వహిస్తుండటం అందరికీ ఇబ్బందికరంగా మారింది. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో రహదారి మొత్తం దుమ్ముధూళితో నిండిపోవటంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

పర్యావరణంపై తీవ్ర ప్రభావం

గ్రానైట్ క్వారీ యజమానులు పర్యావరణ నిబంధనలను పాటిస్తామని

మిగతా 6లో...

చీమకుర్తి ప్రాంతంలో...

క్వారీ లీజులు సుమారు	238
కటింగ్, పాలిషింగ్ ఫ్యాక్టరీలు	1000కి పైగా
కంకర మిల్లులు	30
పనిచేస్తున్న వలస కార్మికులు, స్థానికులు సుమారు	20 వేల మందికి పైగా

4 మండలాల్లో భూగర్భజలాలు కలుషితం

గ్రానైట్ వ్యర్థాలను ముసి వాగులోకి డంపింగ్ చేస్తుండటంతో చీమకుర్తి, ఎస్ఎన్‌పాడు, మర్రిపూడి, కొండపి తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి.

స్లర్రీతో క్యాన్సర్ ముప్పు

స్లర్రీ(ముడిరాయిని కటింగ్ చేసి పాలిషింగ్ చేసే క్రమంలో ద్రవ రూపంలో వచ్చే వ్యర్థాలు)లో వెలువడే సిలికాతో క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు సోకుతాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా అధికారులలో చలనం లేదు.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

- నిమిషం లేటైనా నో ఎంట్రీ
- 629 పోస్టులకు 24,659 మంది అభ్యర్థులు
- రోజుకు రెండు పూటల పరీక్షలు

ఒంగోలు విద్య, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగుల కల ఫలించనుంది. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత(ఆన్‌లైన్) పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 629 పోస్టులకు 24,659 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అంటే ఒక్కొక్క పోస్టుకు సగటున 39మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. పరీక్షలు ప్రతిరోజు రెండు సెషన్లలో జరుగుతాయి. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండవ సెషన్ 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతుంది. పరీక్షకు నిమిషం లేటైనా అనుమతించరు. విద్యార్థులు గంటన్నర ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ఒంగోలులోని క్విస్, పేస్, రైజ్ గాంధీ, రైజ్ ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలు, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఎస్‌సీఎస్ఏఐ సంస్థలో, మార్కాపురంలో కిట్స్, శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సాంకేతికతను టీసీఎస్ అందిస్తుండగా ప్రతి కేంద్రానికి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను డిపార్ట్‌మెంట్ అధికారులుగా నియమించారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను నిషేధించారు.



దివ్యాంగులకు అదనపు సమయం

అంధులు, దివ్యాంగ(రెండు చేతులు లేని) అభ్యర్థులకు 50 నిమిషాలు అదనపు సమయాన్ని కేటాయించారు. దివ్యాంగ అభ్యర్థులకు స్క్రైబ్‌ను కూడా కేటాయిస్తారు. దరఖాస్తులో పీహెచ్‌సీ వివరాలు పేర్కొనకపోయినా స్క్రైబ్

మిగతా 6లో...

పరీక్షల షెడ్యూల్ ఇదీ

మెగా డీఎస్సీ పరీక్షలు శుక్రవారం నుంచి ఈనెల 30 వరకు జరుగుతాయి. శుక్రవారం ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు టీజీటీ గణితం, హిందీ, ఫిజికల్ సైన్స్, తెలుగు.. మధ్యాహ్నం టీజీటీ గణితం పరీక్ష జరుగుతుంది. 7వతేదీన బక్రీదు సందర్భంగా సెలవు ప్రకటించారు మళ్లీ 8న పరీక్ష జరుగుతుంది.

వెలుగులో డీపీఎంల మార్పు

- ఐదుగురు మాత్రమే ఇక్కడ..
- ఏడుగురు బయట జిల్లాలకు
- ఇద్దరు ఏపీఎంలు కూడా
- జిల్లాలో ఎక్కువకాలం పనిచేసిన వారు, ఆరోపణలు ఉన్నవారికి స్థానచలనం
- పూర్తయిన బదిలీల కౌన్సెలింగ్
- నేడో, రేపో వెలువడనున్న ఉత్తర్వులు


ఒంగోలు నగరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగులో సంస్థాగత మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటివరకు మన జిల్లాలో ఎక్కువమంది జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు (డీపీఎం)ఉండగా, కొన్ని జిల్లాల్లో అతి తక్కువమంది మాత్రమే పనిచేస్తున్నారు. కొత్త జిల్లాల్లో అయితే డీపీఎంలు ఒకరిద్దరే పనిచేస్తున్నారు. సంస్థాగత మార్పుల్లో భాగంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఐదుగురు మాత్రమే జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు పనిచేయాల్సి ఉంది. అయితే ప్రకాశం జిల్లాలో 13 మంది డీపీఎంలు పనిచేస్తుండగా వీరిలో ఐదుగురిని జిల్లాలో ఉంచి మిగిలిన ఎనిమిది మందిని

మిగతా 6లో...

వందేభారత్‌పై రాళ్లు రువ్విన దుండగులు

ఒంగోలు- సూరారెడ్డిపాలెం స్టేషన్ల మధ్య ఘటన

మెయిన్‌లో...



వరాహ లక్ష్మీనరసింహస్వామి గుడి

వరాహ లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

- నేడు అంకురార్పణ.. విస్తృత పూజలకు ఏర్పాట్లు
- 11 రోజులపాటు నిర్వహణ
- పాతసింగరాయకొండ దేవస్థానంలో సర్వం సిద్ధం చేసిన అధికారులు

7

స్కూలు అసిస్టెంట్లకు స్థానచలనం..
ఉత్తర్వులు జారీ

ఒంగోలు విద్య, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బదిలీకి దరఖాస్తు చేసుకున్న స్కూలు అసిస్టెంట్ల(ఎస్ఏల)కు ఉత్తర్వులు విడుదలయ్యాయి. మొదట ఎస్ఏ నాన్‌లాంగ్వేజస్ గణితం, పీఎస్, బీఎస్, సోషల్ టీచర్ల బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. సాయంత్రం ఆరు గంటలకు ఈ ఉత్తర్వులు డీఈవో కార్యాలయ ఐటీ సెల్ విభాగం వారు పరిశీలిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ స్థానాలు కేటాయించారా.. లేదా? టీచర్లు పెట్టుకున్న ఆప్షన్లు ప్రాధాన్యత క్రమంలో స్థానాలు కేటాయించారా.. లేదా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. స్థానాల కేటాయింపులో సీనియర్లు, జూనియర్లకు న్యాయం జరిగిందా, లేదా?అన్న విషయాన్ని పరిశీలించి డీఈవో కార్యాలయం ధ్రువీకరిస్తే బదిలీ ఉత్తర్వులు అధికారికంగా వెబ్‌సైట్‌లో టీచర్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అందుబాటులో ఉంచుతారు. ఈ రాత్రికి స్కూలు అసిస్టెంట్ లాంగ్వేజస్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ, సంస్కృతం టీచర్ల బదిలీ ఉత్తర్వులు కూడా విడుదల కానున్నాయి.

వైద్యశాఖలో బదిలీల సందడి

- నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన
- 10, 11 తేదీల్లో అభ్యంతరాలపై విచారణ
- 14న ఫైనల్ జాబితా విడుదల
- 15 నుంచి 17 వరకు కౌన్సెలింగ్
- జిల్లాలో పది రకాల క్యేడర్‌కు స్థానచలనం
- వైద్యాధికారులకు మాత్రం గుంటూరులో



ఒంగోలు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. గతనెల 31వ తేదీన బదిలీలకు వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మార్గదర్శకాలు జారీచేశారు. ఈ నెల 19వ తేదీ నాటికి ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించడంతో తదనుగుణంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు చర్యలు చేపట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న పది రకాల క్యేడర్ ఉద్యోగుల బదిలీలకు ఇప్పటికే దరఖాస్తులను స్వీకరించారు. వైద్యాధికారుల బదిలీలు మాత్రం గుంటూరు ఆర్డీడీ కార్యాలయంలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో జరగనున్న ల్యాబ్ టెక్నీషియన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంపీహెచ్ మేల్, ఎంపీహెచ్ ఫిమేల్, డ్రైవర్లు, ఎఫ్ఎంవోలు, ఎంఎంవోలు, స్వీపర్లు, అటెండర్లను మార్చనున్నారు. ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగులతోపాటు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగులు మూడు నుంచి ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తుంటే వారికీ స్థానచలనం కలిగించనున్నారు.

ఉద్యోగ సంఘాల వారికి తప్పదు

ఉద్యోగ సంఘాల గుర్తింపు ఉన్న సభ్యులను ప్రస్తుతం పనిచేస్తున్న చోట నుంచి

మిగతా 6లో...

ఊరూవాడ.. ఉత్సాహంగా...!

- లక్షల సంఖ్యలో మొక్కలు నాటిన విభిన్న వర్గాల ప్రజలు
- పలుచోట్ల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు
- ఉపయుక్తంగా పర్యావరణ దినోత్సవం
- ఈ ఏడాది 35 లక్షల మొక్కలు నాటాలన్నదే లక్ష్యమని కలెక్టర్ వెల్లడి
- గ్రోత్ సెంటర్‌లో పీసీబీ ఆధ్వర్యంలో సభ
- పాల్గొన్న చైర్మన్ కృష్ణయ్య, ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పట్టణం, పల్లె తేడా లేకుండా గురువారం భారీగా మొక్కలు నాటారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతర ప్రభుత్వ ప్రాంగణాలే కాకుండా పరిశ్రమలు, ఫ్యాక్టరీల ఆవరణలు, పొలం గట్లు, పంటకుంటల వద్ద ఇలా అన్నిచోట్ల లక్షల సంఖ్యలోనే నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టగా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల నుంచి గ్రామ స్థాయిలోని ప్రభుత్వ సిబ్బంది, స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సాధారణంగా పర్యావరణ దినోత్సవం రోజున సభలు, సమావేశాలు నామమాత్రంగా మొక్కలు నాటడం వంటి వాటితో సరిపెడుతుంటారు. అందుకు భిన్నంగా రాష్ట్రప్రభుత్వం ఈసారి పెద్దఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చింది. గతానికి భిన్నంగా ఈసారి రోహిణి కార్తెలో సైతం వర్షాలు కురిసిన నేపథ్యంలో పర్యావరణ దినోత్సవం రోజున రాష్ట్రంలో

మిగతా 6లో...



ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో మొక్క నాటుతున్న కలెక్టర్ అన్సారియా



పూల దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్న కార్పొరేషన్ అధికారులు

ప్లాస్టిక్ వినియోగంపై అధికారుల కన్నెర్ర

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై కార్పొరేషన్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గురువారం ఒంగోలు నగరంలోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లోని దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు భారీగా కవర్లు ఉండటంపై వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అనేకసార్లు హెచ్చరికలు జారీ చేసినా, తీరు మార్చుకోకపోవడంతో వారికి అపరాధ రుసుం విధించారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధించినట్లు హెచ్చరించారు. ఇకపై వ్యాపారులు కవర్లు ఇవ్వడానికి వీలు లేదని స్పష్టం చేశారు. అలాగే ప్రజలు కూడా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ కవర్లు వినియోగం నిషేధించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎం.వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

కాలుష్య కాటు

(5వ పేజీ తరువాయి)

రాతపూర్వకంగా తెలిపి ఈసీ(ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్) పొందుతారు. వాటిని అమలు చేయటంలో మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరించటంతో కాలుష్య భూతం కోరలు చాస్తోంది. వైర్సా కటింగ్, డ్రిల్లింగ్ చేసేటప్పుడు, రాయి వెలికితీసేటప్పుడు, భారీ వాహనాలు రాకపోకల సమయంలో దుమ్ము లేవకుండా వాటర్ స్ప్రింక్లింగ్ నిత్యం చేయాల్సి ఉంది. ఈ నిబంధనను సరిగ్గా పాటించకపోవటంతో ఈ ప్రాంతమంతా దుమ్ముధూళితో నిండి పోతుంటుంది. ఆ ప్రభావాన్ని తగ్గించటానికి మొక్కలను ఈ ప్రాంతంలో పెద్దఎత్తున పెంచాల్సి ఉంది. ఇలా పెంచితే క్వారీయింగ్‌కి ఇబ్బందిగా ఉంటుందని, విలువైన స్థలాన్ని కోల్పోతామని భావిస్తున్న ఓనర్లు మరో ప్రాంతంలో పెంచుతామంటూ ప్రతిపాదనలు చేస్తున్నారు. ప్రభావిత ప్రాంతంలో పెంచకుండా మరో చోట పెంచితే లాభమేమి ఉంటుంది, క్వారీ సరిహద్దుల చుట్టూ మొక్కల పెంపకం చేపట్టాలని కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు యజమానులకు నోటీసులు జారీచేసినా ఖాతరు చేసిన దాఖలాలు కనపడటం లేదు. దీంతో కాలుష్యాన్ని హరించే అవకాశం లేకపోతుంది. వీరికి తోడు కంకరమిల్లుల యజమానులు సైతం నిబంధనలను ఉల్లంఘిస్తూ కార్యకలాపాలు నిర్వహిస్తుండటం సమస్యగా మారింది. దీనివలన ఈ ప్రాంతంలో గాలి కలుషితమై ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారింది. గాలి నాణ్యతా సూచిక సాధారణ స్థాయిలో ఉండకుండా 130వరకూ ఏక్యూఐ స్థాయి ఉంటుందని నిపుణులు లెక్కకట్టారు. దీంతో ఈ ప్రాంతంలో గాలిపీలుస్తున్న వారు శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్నారు.

స్లర్రీతో పర్యావరణానికి విఘాతం

మద్దిచెట్లపాలెం, బూదవాడ ప్రాంతాల్లో గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ ఫ్యాక్టరీలు పెద్దఎత్తున విస్తరించాయి. ముడిరాయిని కటింగ్, పాలిషింగ్ చేసే క్రమంలో ద్రవ రూపంలో వచ్చే వ్యర్థాన్ని స్లర్రీ అని పిలుస్తారు. ఈ స్లర్రీని నివాసాల మధ్య, వాగుల్లో ఇష్టారీతిన డంపింగ్ చేస్తున్నారు. స్లర్రీ డంపింగ్ కోసం తమకు స్థలం కావాలని ఎప్పటి నుంచో ఓనర్లు అధికారులకు వినతిపత్రాలను అందజేస్తున్నారు. అయినా ఇంతవరకూ అధికారికంగా స్థలం కేటాయించలేదు. గత ఏడాది కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ ఈ ప్రాంతంలో పర్యటించి ఇక్కడ వెదజల్లుతున్న కాలుష్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు. పెద్దఎత్తున మొక్కలను పెంచాలని సూచించారు. వ్యర్థాలుగా వెలువడుతున్న స్లర్రీతో ఇటుకలు తయారుచేస్తే పర్యావరణానికి మేలు కలగటంతోపాటు ఉపాధి కల్పన, ఆదాయం కూడా లభిస్తుందని తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. నెలలు గడుస్తున్నా ఆ దిశగా అడుగులు ముందుకు పడలేదు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టిసారించి డంపింగ్ కోసం దూరంగా స్థలం కేటాయించటంతో పాటు పర్యావరణానికి విఘాతం కలుగకుండా తగు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాం

గెలాక్సీ గ్రానైట్ విస్తరించిన ప్రాంతంలో కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాం. క్వారీల్లో ఎవరికి వారు వారి సరిహద్దు చుట్టూ మొక్కలు పెంచాలని తెలియజేశాం. కంకరమిల్లుల యజమానులు దుమ్ముధూళి వెదజల్లకుండా నిబంధనలను పాటించాలని కోరాం. స్లర్రీని ముసిలో కలిపినా ఆవాసాల మధ్య డంపింగ్ చేసినా ఫ్యాక్టరీలను సీజ్ చేస్తామని నోటీసులు ఇచ్చాం. రహదారికిరువైపులా వ్యర్థాలను డంప్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ ప్రాంతంలో పెద్దఎత్తున గ్రీనరీ పెంపునకు ప్రణాళికాబద్ధంగా నడుచుకుంటాం.

- రాఘవరెడ్డి, ఈఈ,
కాలుష్య నియంత్రణ బోర్డు

బాల్యం నుంచే బంగారు భవితకు అడుగులు : ఎస్పీ

ఒంగోలు క్రైం, జూన్5 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే బంగారు భవితకు అడుగులు వేయాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. ఒంగోలులోని పోలీసు మైదానంలో నెల రోజులు పాటు జరిగిన పోలీసు పిల్లల సమ్మర్ కోచింగ్ క్యాంప్ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమ్మర్ కోచింగ్‌లో ఆటలతోపాటుగా విజ్ఞానం, వినోదభరితమైన శిక్షణ ఇప్పించామని తెలిపారు. దీనివల్ల పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకున్నారని చెప్పారు. అనంతరం పలు పోటీల విజేతలకు ఎస్పీ బహుమతులను ప్రదానం చేశారు. కోచ్‌గా వ్యహరించిన రాజేంద్రను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ ఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌కు టంగుటూరు ఎస్‌ఐ

ఒంగోలు క్రైం, జూన్5(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న టంగుటూరు ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావును వీఆర్‌కు పిలుస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ గురువారం ఆదేశాలు ఇచ్చారు. ఈమేరకు నాగమల్లేశ్వరరావును విధుల నుంచి పక్కన పెట్టి, ఎస్పీ సీఐ వద్ద రిపోర్టు చేయాలని ఆదేశించారు. దీంతో ఆయన టంగుటూరు నుంచి ఒంగోలు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

జాబితాలో పేరు లేని అభ్యర్థులు డీఈవోను సంప్రదిస్తే వెంటనే కేటాయిస్తారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్లలో నో ఫొటోగ్రాఫ్ ఉన్న అభ్యర్థులు తాజా ఫొటోను, గుర్తింపు కార్డుతో వారిని పరీక్షకు అనుమతిస్తారు. మంగళగిరిలోని పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోలు రూము పరీక్ష జరిగే అన్ని రోజుల్లో ఉదయం 7 నుంచి రాత్రి ఏడు గంటల వరకు పనిచేస్తుంది. డీఈవో కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్‌ను ఏర్పాటు చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించాలని డీఈవో కిరణ్‌కుమార్ కోరారు.

రెండు లారీలు ఢీ

● ఒకరి మృతి..
మరో ఇద్దరికి తీవ్రగాయాలు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని తుమ్మనపల్లి గ్రామశివారులోని కాకతీయకాలువ బ్రిడ్జి వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 6.20గంటల ప్రాంతంలో కరీంనగర్ వైపు నుంచి, అటు వరంగల్ వైపు నుంచి వస్తున్న రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా టంగుటూరు గ్రామానికి చెందిన దాచేపల్లి కృష్ణకిషోర్(44) లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అతికష్టం మీద క్షతగాత్రుడికి బయటకితీసి చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించేలోపే మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా లారీ క్లీనర్ మస్తాన్, మరో డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు లారీలు బ్రిడ్జిపై ఢీకొని ఉండటంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు పడాల్సివచ్చింది. పోలీసులు వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఊరూవాడ.. ఉత్సాహంగా...।

(5వ పేజీ తరువాయి)

కోటి మొక్కలు నాటాలని నిర్ణయించగా అందులో జిల్లాలో 4.10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్య నిర్దేశం చేశారు.

లక్షల్లో మొక్కలు నాటారు

తదనుగుణంగా శాఖల వారీగా, ప్రాంతాల వారీగా నాటాల్సిన మొక్కల లక్ష్యాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా కేటాయించారు. సామాజిక అటవీ శాఖ, డ్వామా, కాలుష్య నియంత్రణ మండలి శాఖల ఆధ్వర్యంలో అన్నిశాఖలను భాగస్వాములుగా చేసి ప్రణాళిక రూపొందించగా తదనుగుణంగా గురువారం లక్షల సంఖ్యలోనే నాటారు. ఒక్క డ్వామా పరిధిలోనే 1.90 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించగా ఇటీవల పొలాల్లో తవ్విన పంట కుంటలు, గట్ల మీద, అలాగే పొలాల చుట్టూ భారీగా నాటించారు. ఫీల్డ్ అసిస్టెంట్ పరిధిలో లక్ష్యాన్ని పెట్టి నాటించారు. అలాగే ఆ శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో తల్లి పేరుతో ఒక మొక్క నినాదంతో ఆ సంస్థల్లో ఉన్న విద్యార్థులందరితో మొక్కలు నాటించగా కలెక్టర్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం మినీ స్టేడియంలో మొక్కలు నాటడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సభను నిర్వహించారు. కలెక్టర్ అన్సారియా, మేయర్ గంగాడ సుజాత, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీ ఎత్తున కార్యక్రమాలు

కాలుష్య నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోలు బోర్డు (పీసీబీ) ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య, ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, కలెక్టర్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు. పామూరు మండలం లక్ష్మీనరసాపురంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మొక్కలు నాటగా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మొక్కలు నాటారు. వైపాలెం ప్రభుత్వ వైద్యశాలలో ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు మొక్కలు నాటగా దర్శిలోని ఎంఎస్‌ఎంఈ పార్కులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి మొక్కలు నాటారు. అలాగే వివిధ పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు వందలాది గ్రామాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో వక్తలు పిలుపునిచ్చారు.

వెలుగులో డీపీఎంల మార్పు

(5వ పేజీ తరువాయి)

ఇతర జిల్లాలకు బదిలీ చేస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో కృపారావు, దానం, లక్ష్మిరెడ్డి, రజనీకాంత్, అంబేడ్కర్‌లు జిల్లాలోనే ఉండనున్నారు. వీరు పోను మిగిలిన వారిలో నరసింహారావు, డేవిడ్, రాంబాబు, సునీత, సుధాకర్, కృష్ణకుమారి, విజయమ్మ ఇతర జిల్లాలకు బదిలీ కానున్నారు. జిల్లాలో ఇప్పటివరకు డీపీఎంగా పనిచేసిన కత్తి కళ్యాణ్ ఇటీవల ఉద్యోగ వి రమణ చేశారు. దీంతో మిగిలిన ఏడుగురిని మార్చనున్నారు. కాగా ఈ ఏడుగురు డీపీఎంలకు ఇటీవల విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో కౌన్సెలింగ్ కూడా నిర్వహించారు. అందులో వారు కోరుకున్న చోటికి బదిలీ చేస్తూ త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. కాగా సంస్థాగత మార్పుల్లో భాగంగా జిల్లాలో ఇద్దరు ఏపీఎంలు కూడా అదనంగా ఉన్నారు. వీరిని జోనల్ స్థాయిలోని పక్క జిల్లాలకు బదిలీ చేయనున్నారు. ఇప్పటివరకు వెలుగులో ఉన్న ఒక్కో విభాగాన్ని ఒక్కో డీపీఎం పర్యవేక్షించగా ఇప్పుడు ఆ పోస్టులను కుదించటంతో రెండు విభాగాలకు ఒక్కరే డీపీఎం పర్యవేక్షణ చేయనున్నారు. ఐబీ, హెచ్‌డీ విభాగాలకు ఇప్పటివరకు వేర్వేరు డీపీఎంలు ఉండగా ఇక నుంచి ఈ రెండు విభాగాలు ఒకే డీపీఎం పరిధిలోకి వెళ్లనున్నాయి. ఫైనాన్స్, హెచ్ ఆర్ విభాగాలకు ఒకరు, బ్యాంకు లింకేజీ, ఉన్నతి విభాగాలకు ఒకరు, లైవ్‌లీ హుడ్స్ విభాగానికి ఒ కరు డీపీఎంగా పనిచేయనున్నారు. మొత్తం మీద జిల్లా నుంచి ఏడుగురు డీపీఎంలకు ప్రభుత్వం ఇతర జిల్లాలకు బదిలీ చేయనుంది. ఇలా బయటకు జిల్లాలకు పంపుతున్న వారిలో ఎక్కువ కాలం పాటు జిల్లాలో పనిచేసిన వారు, నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న వారు ఉన్నట్లు సమాచారం.

వైద్యశాఖలో బదిలీల సందడి

(5వ పేజీ తరువాయి)

అదే కార్యాలయంలో మరోచోటకు, అక్కడ ఖాళీలు లేకపోతే సమీపంలోని ప్రాంతాలకు పంపాలని మార్గదర్శకాలు జారీచేశారు. దీంతో తదనుగుణంగా వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని శుక్ర, శని వారాల్లో పరిశీలన చేయనున్నారు. వచ్చిన దరఖాస్తులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 9వ తేదీన స్వీకరిస్తారు. ఆయా దరఖాస్తులపై ఏమైనా అభ్యంతరాలు వస్తే ఈనెల 10, 11 తేదీల్లో సంబంధిత అధికారులు పరిష్కరిస్తారు. ఈనెల 14తేదీన బదిలీలకు సంబంధించి ఫైనల్ జాబితాను ప్రకటిస్తారు. ఈనెల 5వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు వైద్యశాఖ ఏర్పాట్లు చేసింది. అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బదిలీల్లో ఏమైనా తప్పిదాలు జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత తీసుకోవాల్సి వస్తుందని వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో బదిలీల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.



సుంకరవారిపాలెంలో ఓ రైతు సాగు చేసిన బొప్పాయి తోటలో చెట్లనే పండిపోతున్న కాయలు

బొప్పాయి రైతులు బావురుమంటున్నారు. ధర దారుణంగా పడిపోవడంతో డీలా పడిపోయారు. ఎకరానికి లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టి సాగు చేసిన రైతులు కాయలు కొనే వారు లేక దిగాలుపడ్డారు. కాయలు కోస్తే కనీసం కూలి అయినా రాకపోవడంతో చెట్లనే వదిలివేశారు. మరికొందరు చేసేది లేక రోడ్డు పక్కన కాయలు పెట్టుకుని కిలో రూ.4 కు విక్రయిస్తున్నారు. నెల క్రితం బొప్పాయి టన్ను ధర రూ. 20 వేలు పలికింది. నెల రోజులు గడిచే సరికి రూ. మూడు నుంచి నాలుగు వేలకు పడిపోయింది. దీంతో చెట్లపైనే పండిపోతున్న కాయలను చూసి రైతులు కన్నీళ్ల పర్యంత మవుతున్నారు. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాని దయనీయ స్థితిలో ఉన్నారు.

బొప్పాయి రైతు బావురు

- నెల రోజుల క్రితం టన్ను రూ. 20వేలు
- నేడు రూ. 4వేలకు పడి పోయిన వైనం
- ఇటీవల గాలి వాన బీభత్సానికి దెబ్బతిన్న తోటలు
- వెంటాడిన తెగుళ్లు
- చెట్లకే పండి పోతున్న కాయలు
- దిక్కుతోచని స్థితిలో సాగు రైతులు

ముండ్లమూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి పంటకు ధర ఒక్కసారిగా పడి పోయింది. దీంతో తీవ్ర నష్టాల పాలయ్యారు. ఆరు గాలం కష్ట పడి బొప్పాయి సాగు చేసిన రైతులకు ఒక వైపు ధర లేక అల్లాడి పోతుంటే మరో వైపు ఇటీవల వచ్చిన గాలి వాన బీభత్సానికి పూర్తిగా తోటలు పడిపోయాయి. ఈ స్థితిలో తోటలు సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా రాక ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండలంలోని పసుపుగల్లు, చింతలపూడి, ముండ్లమూరు, మారెళ్ల, సుంకరవారిపాలెం, శంకరాపురం, పోలారం, నాయుడుపాలెం, పూరిమెట్ల, తమ్మలూరు, రామకృష్ణాపురం, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు 200 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు. ఒక్కో రైతు రెండు నుంచి పది ఎకరాల వరకు వేశారు. ఇప్పటికే ఎకరానికి రూ. 50వేల నుంచి లక్ష రూపాయల వరకు పెట్టుబడులు పెట్టారు. మరి కొంతమంది రైతులకు ఇంకా అదనంగా కూడా అయింది. కానీ దిగుబడి వచ్చే సరికి కొంత ఆశాజనకంగా ఉన్నా ధర మాత్రం పూర్తిగా పడి పోయింది. నెల రోజుల క్రితం టన్ను రూ. 20వేలు పలికింది. దీంతో బొప్పాయి సాగు చేసిన రైతులు ఈ ఏడాది పది రూపాయలు వెనకేసుకోవచ్చని ఆనందంగా ఉన్నారు. ఆ ఆనందం నెల రోజులు తిరగక ముందే ఆవిరయ్యింది. కేవలం టన్ను రూ. 3వేల నుంచి రూ. 4వేలకు కూడా కొనుగోలు చేయటం లేదు. ఇదే అదునుగా భావించి దళారులు రంగ ప్రవేశం చేశారు. ఇప్పుడు అమ్మకపోతే కాయలకు ఇంకా రేటు పడిపోతుందని చెప్పడంతో చేసేదిలేక రైతులు వారు అడిగిన ధరకు విక్రయిస్తున్నారు. మరి కొంతమంది రైతులైతే ఆ ధరకు అమ్ముకోవటానికి ఇష్టం లేక చేలోనే ఉంచారు. అవి పాకానికి వచ్చి పూర్తిగా పండిపోతున్నాయి. కోస్తే కోత, కూలీ ఖర్చులు కూడా రావేమోనని కొందరు రైతులు చెట్లనే వదిలి వేస్తున్నారు. ప్రస్తుతం ధర లేక పోవడంతో పంట కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలోనని రైతులు తలలు పట్టుకున్నారు. ప్రభుత్వం స్పందించి బొప్పాయి రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

రూ. 2 లక్షలు నష్టం

ఈ ఏడాది రెండు ఎకరాల్లో బొప్పాయి పంట సాగు చేశాను. కాపు బాగా వచ్చింది. ఇంతలో ఒక వైపు తెగుళ్లు, మరో వైపు గాలి వాన బీభత్సంతో ఎకరం పూర్తిగా దెబ్బతిన్నది. మిగతా ఎకరంలో కాయలు అమ్ముకుందామనుకొనే సరికి నెల రోజుల క్రితం టన్ను ధర రూ. 20వేలు పలకగా నేడు మూడు నుంచి నాలుగు వేలకు పడి పోయింది. దీంతో ఒక్కసారిగా ఆశలన్నీ ఆవిరై పోయాయి. రెండు లక్షల మేర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది.



- భోగ్యం ఏడుకొండలు, సుంకరవారిపాలెం, ముండ్లమూరు మండలం

మెగా డీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో జరగనున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షను పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం పరీక్షా కేంద్రాల డిపార్ట్‌మెంట్ అధికారులు, లైజనింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు సహాయం కోసం కమాండ్ కంట్రోల్ రూమును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమాండ్‌కంట్రోలు రూములో నలుగురు జిల్లా విద్యాశాఖాధికార్యాలయ ఉద్యోగులు ఉంటారన్నారు. కంట్రోలు రూములో ఎస్‌కే మదారబీ 9441991757, సీహెచ్ నవ్య 8977690457, నవ్యరోహిణి 7989416703, ఎస్. హర్షిక 7416109602 నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. అదే విధంగా విద్యాశాఖ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

9 నుంచి టీచర్లకు శిక్షణ

ఒంగోలు విద్య, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హైస్కూళ్లలో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లు, హెడ్మాస్టర్లకు ఈనెల 9నుంచి మూడు రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల సంసిద్ధతపై నిర్వహిస్తున్న ఈశిక్షణకు స్కూలు అసిస్టెంట్లు అందరూ హాజరుకావాలన్నారు. ప్రస్తుతం టీచర్లబదిలీలు ఇంకా ఒక కొలిక్కి రాకపోవడంతో టీచర్లు పాఠశాలల పునఃప్రారంభం తేదీ ఈనెల 12న పాఠశాలలకు హాజరు కావాలని డైరెక్టర్ కోరారు.



వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వ్యూ (ఇన్‌సెట్లో) స్వామివార్లు

నేటి నుంచి వరాహ లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

- 11 రోజులపాటు నిర్వహణ
- పాతసింగరాయకొండ దేవస్థానంలో ఏర్పాట్లు పూర్తి

సింగరాయకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాత సింగరాయకొండ శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం అంకురార్పణ చేయనున్నారు. 11 రోజులపాటు ఉత్సవాలను ఆగమశాస్త్రం ప్రకారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాలకు శుక్రవారం రాత్రి అంకురార్పణ చేస్తారు. 7వ తేదీ ఉదయం ధ్వజారోహణ, రాత్రి చంద్రప్రభ వాహనం, 8వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రికి హంస వాహనంపై స్వామిని ఊరేగిస్తారు. 9వ తేదీ ఉదయం చప్పరసేవ ఉంటుంది. రాత్రికి శేషవాహనంపై స్వామివారు విహరిస్తారు. 10వ తేదీ ఉదయం చప్పరసేవ, రాత్రి హనుమంతసేవ, 11వ తేదీ ఉదయం మోహిని ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి గరుడవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.

12వ తేదీ ఉదయం చప్పరసేవ, రాత్రి వసంతోత్సవం, తెల్లవారుజామున గజోత్సవం జరుగుతాయి. 13వ తేదీ ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. 14వ తేదీ ఉదయం చప్పరసేవ, రాత్రి గుర్రపు వాహనం, 15వ తేదీ లక్ష్మీ సంవాద ఉత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణ, పూర్ణాహుతి ఉంటాయి. 16వ తేదీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

కలుజువ్వలపాడులో వనం - మనం రద్దు

- అధికారుల కోసం వేచిఉన్న నారాయణరెడ్డి
- ఎంతకీ రాని అధికారులు
- ఫోన్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు
- విషయం డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడి


అటవీ అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే కందుల ఆగ్రహం



కార్యక్రమానికి హాజరుకాని సామాజిక అటవీ అధికారులపై ఫోన్‌ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

తర్లుపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కలుజువ్వలపాడు సచివాలయం వద్ద జరగాల్సిన వనం - మనం కార్యక్రమం అటవీ అధికారుల నిర్లక్ష్యం వల్ల రద్దయింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరై 20 నిమిషాల పాటు ఫారెస్ట్ అధికారుల కోసం వేచి చూశారు. కానీ ఒక్కరూ హాజరుకాకపోవడంతో వెంటనే జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఫారెస్ట్ అధికారులపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనం-మనం కార్యక్రమాన్ని అభాసుపాలు చేసేందుకు ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. కొందరు అధికారులు వైసీపీ నాయకులతో కుమ్మక్కై కార్యక్రమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, మొక్కలు ఇవ్వకుండా ఉండడం ఏంటని ప్రశ్నించారు. వైసీపీ నాయకులతో చేతులు గలిపి అటవీ అధికారులు కొనకనమిట్ల, పొదిలి, తర్లుపాడు మండలాల్లో సామాజిక వనాలను అభివృద్ధి చేస్తామంటూ లక్షలాది రూపాయాలు కాజేసి దోచుకుంటున్నారని ఆరోపించారు. కనీసం ఎమ్మెల్యేననే గౌరవం లేకుండా అగౌరవ పరిచేవిధంగా వ్యవహరిస్తున్నారన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, కార్యక్రమానికి హాజరుకాని సిబ్బంది తీరును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అలాగే సోషల్ ఫారెస్ట్ అధికారుల అవినీతి అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, కలుజువ్వలపాడు సర్పంచ్ శిరోమణి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దాలి



టీచర్లకు శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖలో రాష్ట్ర స్థాయిలో వస్తున్న మంచి మార్పులకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దేందుకు టీచర్లకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక పీవీఆర్ బాలుర హైస్కూలులో ఈనెల 3నుంచి జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లకు జరుగుతున్న శిక్షణ గురువారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ టీచర్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేసి విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలన్నారు. శిక్షణలో టీచర్లకు అకడమిక్ క్యాలెండర్, టీచర్ హ్యాండ్‌బుక్, స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్‌లెట్ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, రాష్ట్ర పరిశీలకులు చంద్రశేఖర్, డైట్ సీనియర్ లెక్చరర్ తిరుపతయ్య, పి. రమేష్, బలరామకృష్ణ, సీహెచ్ రఘుబాబు, సోమశేఖర్, సుభాని, పిచ్చయ్య, మధు, లాల్‌సాహెబ్ తదితరులు ఉన్నారు.

228 మంది విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

ఒంగోలు విద్య, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 228 మంది విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. అవార్డులకు ఎంపికైన విద్యార్థుల ప్రాథమిక జాబితాను పాఠశాల విద్య కమిషనర్ విడుదల చేశారు. విద్యార్థుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి డీఈవో ధ్రువీకరించిన అనంతరం తుది జాబితాను అధికారికంగా ప్రకటిస్తారు. మండలానికి ఆరుగురు చొప్పున ప్రతిభావంతులను రాష్ట్ర స్థాయి ప్రతిభా అవార్డులకు ఎంపిక చేశారు. ఈ అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు రూ. 20వేల నగదు, శాలువ, మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు. మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కామన్‌గా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఈ అవార్డులకు ఎంపిక చేశారు.



మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, నేతలు

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య కోరారు. గురువారం స్థానిక షాదీఖానాలో సీపీఐ నియోజకవర్గ 4వ మహాసభలో ఆయన మాట్లాడారు. ఆగస్టులో జరిగే మహాసభలకు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. అనంతరం నియోజకవర్గ సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దేవండ్ల శ్రీనివాస్, సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, గురునాథం, కేవీ కృష్ణగౌడ్, సాంబశివరావు, మల్లికార్జున రామయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

- ● ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- ● వైసీపీని వీడిన 50 కుటుంబాలు

కొమరోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆయన గృహంలో మండలంలోని పుల్లారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని గోపాలపల్లి గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో గురువారం చేరారు. వారికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి వైసీపీ నుంచి టీడీపీలోకి వస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. పార్టీలో చేరినవారిలో బొమ్మిని పెద్ద నాగయ్య, మారె వీరాంజనేయులు, చిన్న రామయ్య, బాలజీ, లక్ష్మయ్య, పెద్ద రామయ్య తదితరులున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు దప్పిలి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ రామక్రిష్ణారెడ్డి, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు



గ్రోత్‌సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్, పలువురు అధికారులు



మినీ స్టేడియంలో మొక్కను నాటుతున్న చైర్మన్ బాలాజీ



కలెక్టరేట్‌లో మొక్కను నాటుతున్న జేసీ గోపాలకృష్ణ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- కలెక్టర్ అన్సారియా పిలుపు
- ఘనంగా వన మహోత్సవ కార్యక్రమాలు
- హాజరైన టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని
- గ్రోత్‌సెంటర్‌లో మొక్కలు నాటిన ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్‌ను నిరోధించి పచ్చని మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని స్థానిక మినీ స్టేడియంలో కమిషనర్ డాక్టర్ కెవెంకటేశ్వరరావు అధ్యక్షత నిర్వహించారు. కలెక్టర్ అన్సారీయా, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పర్యావరణం ప్రమాదంలో పడిందన్నారు. ప్లాస్టిక్ వినియోగం పెరగడం వల్ల ప్రమాదకరమైన క్యాన్సర్ బారినపడే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు దీనిని గమనించాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా ఒక్క రోజులోనే 4.10లక్షల మొక్కలు నాటుతుండగా, ఈ 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 35 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వశాఖలను వన మహోత్సవంలో భాగస్వాములు అయ్యేలా ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కను నాటి బతికించే బాధ్యతను స్వీకరించాలని, వన సంరక్షణలో పొదుపు మహిళలు కీలకపాత్ర పోషించాలని కోరారు. అనంతరం చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం 2500 సంవత్సరాల క్రితమే అశోకుడు రహదారుల వెంట మొక్కలు నాటించారని పేర్కొన్నారు. దీంతో ప్రజలు ఎంతటి దూరమైన నడిచి వెళ్ళేవారని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంచి ఆలోచనతో రాష్ట్రంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం పలికారన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఒంగోలులో లక్ష మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయం అన్నారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగర అభివృద్ధిలో పచ్చదనానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో లక్ష మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ పి.శ్రీహరి, పలు శాఖల అధికారులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు మొక్కలు నాటి, ప్రజలకు పంపిణీ చేశారు. అలాగే కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొప్పోలులోని చెరువు గట్టుపై మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈ చంద్రయ్య పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో..

నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో కలెక్టర్ తమీమ్ అన్సారీయా మొక్కలు నాటారు. విద్యార్థులు చిన్నతనం నుంచే మొక్కలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జేసీ

ఒంగోలు కలెక్టరేట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేషు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలి

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక పాత రిమ్స్‌లో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే నినాదంతో ప్లాస్టిక్‌కాలుష్యాన్ని నివారించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ భగీరధి, ఎన్‌సీడీ నోడల్ అధికారి రాజేష్, విక్రమ్‌బాబు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆధ్వర్యంలో..

వలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ చైర్మన్ వీరభద్రాచారి ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ నుంచి మినీస్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, ప్రతినిధులు పాల్గొన్నారు.

క్విస్‌లో..



వనమహోత్సవంలో సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, బీజేపీ నాయకులు

ఒంగోలు విద్య: స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ పర్యవరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా క్విస్ విద్యాసంస్థల అధినేత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి మొక్కలు నాటారు. ఎన్‌సీసీ విద్యార్థులతో పాటు బీజేపీ కార్యకర్తలు విరాట్‌నగర్, వెంగముక్కలపాలెం, సర్వేరెడ్డిపాలెం, క్విస్ కళాశాల వరకు ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు సంస్థల్లో..



ప్రమాణం చేస్తున్న మహిళాభ్యుదయ సమితి సభ్యులు

ఒంగోలు కల్చరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురువారం పలు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళాభ్యుదయ సమితి శక్తిసదన్‌లో సభ్యులు, ఇతర మహిళలు ప్రమాణం చేశారు. సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ నేతృత్వంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కోశాధికారి బీరం అరుణ, మాజీ ఎంపీపీ చిరుతోటి నరసమ్మ, చల్ల కనకదుర్గ, ఒంటేరు మలన్, గుంటుపల్లి శ్రీదేవి, పి.నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

- సమతానగర్ చెరువుకట్ట ప్రాంతంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయరావ్ ఆధ్వర్యంలో చిన్నారి అమృతచే మొక్కలు నాటించారు. ఆగస్టు 15 వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మోర్చా జిల్లా ఇన్‌చార్జి తీగల సత్యవతి, ధనిశెట్టి రామునాయుడు, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కార్యదర్శి ఆదిలక్ష్మి అధ్యక్షతన డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జి.శాంసన్, మృదుల్ కుమార్, ఎస్.అనిల్, పాఠకులు పాల్గొన్నారు.
- వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో 100 రోజుల్లో 100 చెట్లు నాటే కార్యక్రమాన్ని వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్స్ ద్వారా నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు భూమా శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సీతారాంపురం వాసవి విద్యానిధి ఆర్యవైశ్య బాలుర వసతిగృహం వద్ద గురువారం మొక్కలు నాటారు. క్లబ్ రీజన్ చైర్మన్ చలువాది సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ చీదెళ్ల వెంకటప్రసాద్, రాధా రమణ గుప్తా జంధ్యం, కోశాధికారి మద్దాలి శివప్రసాద్, రాంజీ గుప్తా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఒంగోలు(రూరల్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు కోరారు. ఒంగోలు మండలం ఉలిచి జడ్పీ హైస్కూల్‌లో గురువారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా యన మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కోరారు. జనపనార సంచులు వాడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య, ఏపీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాపర్లలో..

నాగులుప్పలపాడు: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్ కోరారు. వన మహోత్సవంలో భాగంగా రాపర్ల పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన స్థానిక టీడీపీ నాయకులు, అధికారులతో కలసి గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో రవి, టీఏ సురేష్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ లాజర్, నాయకులు మెట్టు సుబ్బయ్యనాయుడు, రమణారెడ్డి, పూల కొండయ్య, మండే బాబురావు, రాఘవరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు పాల్గొన్నారు.

గ్రోత్‌సెంటర్‌లో..

మద్దిపాడు: కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాటాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉద్యమస్ఫూర్తితో మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ మొక్కలు మానవ మనుగడకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జోసెఫ్, తహసీల్దార్ ఎస్.నారాయణ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్, జి.వీరభద్రాచారి, కె.భాస్కరరావు, ఏలూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..



మొక్కను నాటుతున్న రామబ్రహ్మం తదితరులు

చీమకుర్తి: పర్యావరణ దినోత్సవాన్ని చీమకుర్తిలో గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య, టీడీపీ నాయకులు గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, క్రాటగడ్డ రమణయ్య, వైసీపీ నాయకులు గోపురం చంద్ర, భీమన వెంకట్రావు, ఆముదాలపల్లి రామబ్రహ్మం మొక్కలు నాటారు. ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం కుమార్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి

ఒంగోలు(రూరల్), జూన్5 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ఇరువురు జిల్లా క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గురువారం ఒంగోలులో క్రీడాకారులు లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిని జిల్లా కబడ్డీ అసోషియేషన్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, చైర్మన్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, కోశాధికారి డి.రమేష్‌బాబు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శిరిగిరి రంగారావు, గడ్డం శ్రీనివాసరావు, కొన్నె ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి



గుర్తుతెలియని మృతదేహం

ఒంగోలు క్రైం, జూన్5(ఆంధ్రజ్యోతి): యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన ఒంగోలులోని రైల్వేస్టేషన్ సమీపంలోని కేవీఆర్ లాడ్జి ఎదురు జరిగింది. సుమారు 30 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని యువకుడు గురువారం మృతి చెంది పడి ఉన్నాడు. ఎలాంటి గాయాలు శరీరంపై కనిపించడం లేదు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. దీంతో మృతదేహాన్ని రిమ్స్‌లో భద్రపరుస్తున్నామని, వివరాలు తెలిసిన వారు 9121102124 సెల్‌నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

15న ప్రకాశం కిడ్స్ ఫ్యాషన్ వీక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రియాజ్, రవిశంకర్

ఒంగోలు కల్చరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): విక్కీ మీడియా ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ప్రకాశం కిడ్స్ ఫ్యాషన్ వీక్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఎస్.వరుణ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఒంగోలులో లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ షేక్ రియాజ్, రవిశంకర్ గ్రూప్ చైర్మన్ కంది రవిశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో ప్రథమంగా ఇటువంటి ఫ్యాషన్ వీక్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు వరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొనటానికి ఈ నెల 12వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 8712375661 నెంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.కార్తీక్, నరసింహ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ రజియాసుల్తానా

నాగులుప్పలపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ రజియాసుల్తానా సూచించారు. ఈ నెల 7న బక్రీద్ సందర్భంగా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ముస్లిం మత పెద్దలతో నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మసీదులు, ఈద్గాల వద్ద ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పాలని, గ్రామస్థాయిలో ఏవైనా సమస్యలుంటే పోలీసులకు తెలియపరచాలని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన



ఆకుకూరలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపట్నం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న ఆకుకూరలు, ఇతర పంటలను గురువారం అధికారుల బృందం పరిశీలించింది. ప్రకృతివ్యవసాయంపై రెండు రోజులుగా ఒంగోలులో జరుగుతున్న శిక్షణలో భాగంగా వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది కొత్తపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో సురేంద్ర, జ్యోతి, ఆదిలక్ష్మి రైతులు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. తక్కువ ఖర్చుతో చేస్తున్న ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక లాభాలు గడిస్తున్నట్లు రైతులు తెలిపారు. కొత్తపట్నంలోని బయోఇన్‌పుట్స్ దుకాణం నుంచి రైతులకు అవసరమైన కాషాయాలు, ద్రావణాలు, ఎల్లో ప్లేట్స్, ఘన జీవామృతం సరఫరా చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.


చలో విజయవాడకు తరలిన ఉద్యోగులు



ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా నుంచి భారీగా ప్రభుత్వ ఉద్యోగులు తరలివెళ్ళారు. సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, ఉద్యోగులు బయలుదేరారు. ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న 14 ప్రధాన డిమాండ్లతో రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో సంఘం నాయకులతో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా 1వతేదీన జీతాల చెల్లింపునకు చట్టసవరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, రంగారెడ్డి, మసూద్‌ఆలీ, మోటా శ్రీనివాసరావు, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్, శ్రీదేవి, చెంచిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్లు బాధ్యతతో పనిచేయాలి



మాట్లాడుతున్న మధుసూదనరావు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు బాధ్యతతో పనిచేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎస్.మధుసూదనరావు సూచించారు. స్థానిక మలేరియా కార్యాలయంలో గురువారం ల్యాబ్‌టెక్నీషియన్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినెలా లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. మలేరియా కేసు నమోదు అయితే వెంటనే జిల్లా కార్యాలయానికి సమాచారం అందించాలని, మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్‌కు కూడా తెలియజేయాలని ఆయన చెప్పారు. జూన్ నెల యాంటీమలేరియా మాసంగా ప్రభుత్వం ప్రకటించినందున ఆరోగ్యకేంద్రాలకు వచ్చే ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు పి.శ్రీనివాసులు, సాగర్, సూపర్‌వైజర్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం : బీఎన్



చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నాయకులు

మద్దిపాడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని లింగంగుంట, ఏడుగుండ్లపాడు, ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెం, నందిపాడు, సీతారాంపురం, దొడ్డవరప్పాడు, మద్దిపాడు, కొలచనకోట, దొడ్డవరం, గాజులపాలెం, గుండ్లాపల్లి, అన్నంగి గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా 40మందికి రూ.20,27,265 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు, మధ్యతరగతి వారికి సీఎం సహాయనిధి కింద సహాయం అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, అడకా స్వాములు, గోరంట్ల చిరంజీవి, మండవ గోపీనాథ్, మండవ గోవిందరాజులు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ మన్నం కిషోర్, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, సర్పంచ్ శిల్పాసౌందర్య, మండవ వెంకటస్వామి, చుండూరి రఘురాం, మండవ కోటేశ్వరరావు, పోతుల శ్రీరామమూర్తి, రెబ్బవరపు ప్రభాకర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని గద్దలగుంట యూపీ హెచ్‌సీలో నేషనల్ హెల్త్‌మిషన్‌లో ఫార్మసీ ఆఫీసర్‌గా పనిచేస్తూ గుండె పోటుతో మృతిచెందిన ఎ.ఆంజనేయులు కుటుంబానికి జిల్లా ఏపీ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశపు హాలులో జరిగిన కార్యక్రమంలో ఆంజనేయులు కుటుంబానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు రూ.1.72లక్షలను అందజేశారు. ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ద్వారా తమ ఫార్మసీ ఆఫీసర్ల ద్వారా నగదును సేకరించి మృతుని కుటుంబానికి అందజేయడం అభినందనీయమని వెంకటేశ్వర్లు కొనియాడారు. కాగా ఆంజనేయులు కుటుంబానికి అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఒకరికి ఉద్యోగం ఇప్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని అసోసియేషన్ నాయకులు డీఎంహెచ్‌వోను కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.రవికిరణ్, కార్యదర్శి కె.రత్నాకర్‌బాబు, ప్రతినిధులు సూర్యప్రగతి, స్వర్ణమంజరి, పద్మ, వెంకట్రావు, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరల కోసం పొగాకు రైతుల నిరసన

నోబిడ్‌లు నివారించాలి

లోగ్రేడ్‌ను కొనుగోలు చేయాలని డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి తులసి (ఇన్‌సెట్లో)

ఒంగోలు(రూరల్), జూన్5(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2లో రైతులు గిట్టుబాటు ధరల కోసం గురువారం వేలం ప్రక్రియను నిలుపుదల చేశారు. అనంతరం నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. సుమారు రెండు గంటల పాటు వేలాన్ని నిలుపుదల చేసి తమకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎఫ్-2రకం కూడా అతి తక్కువగా కిలో రూ.220కు కొనుగోలు చేయడం దారుణంగా ఉందన్నారు. నాణ్యమైన పొగాకును కూడా నోబిడ్ చేశారని ఆరోపించారు. లోగ్రేడ్‌లు, మధ్య రకం బేళ్లను అతి తక్కువ ధరలకు కొనుగోలు చేయటంపై ఆవేదన వ్యక్తం చేశారు. బోర్డు ఆర్ఎం ఎం.లక్ష్మణరావు, వేలంనిర్వహణాధికారి జె.తులసిలను వారు ప్రశ్నించారు. దీంతో వారు స్పందిస్తూ అధిక ధరలకు కొనుగోలు చేయాలని వ్యాపారులతో ఎప్పటికప్పుడు సమావేశాలలో చెబుతున్నట్లు చెప్పారు. నోబిడ్‌లు నివారించటానికి పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. వేలం నిర్వహణాధికారి తులసీ మాట్లాడుతూ పొగాకు వేలం ప్రక్రియ నిలుపుదల చేయడం సాధ్యం కాదన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాలు ఉంటేనే వేలం నిలుపుదల చేస్తామని తేల్చి చెప్పడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా వేలానికి దేవరంపాడు, బీవీపాలెం, ఉలిచి, పానకాలపాలెం, చేజర్ల, కరవది గ్రామాల రైతులు బేళ్లు వేలానికి తీసుకువచ్చారు. అనంతరం వేలం తిరిగి ప్రారంభమైంది.

3 బేళ్లు మాత్రమే తీసుకురావాలి

పొగాకు రైతులు 6వ తేదీ నుంచి బ్యారన్‌కు మూడు బేళ్ల మాత్రమే తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి జె.తులసి ఒక ప్రకటనలో తెలిపారు. 8వ రౌండ్ షెడ్యూల్ ప్రకారం 6వ తేదీన పోతవరం, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డిపాలెం, కె.మామిడిపాలెం, యరజర్ల, చెరురువు కొమ్ముపాలెం, 9న ఒంగోలు, గుత్తికొండవారిపాలెం, అనుబ్రోలువారిపాలెం, కేశినేనివారిపాలెం, ప్రాసంగలపాడు, ఉప్పుగుండూరు, చదలవాడ, కొప్పోలు, సూరారెడ్డిపాలెం, 10న అమ్మనబ్రోలు, చవటపాలెం, రాపర్ల, మాచవరం, 11న నాగులుప్పలపాడు, ఒమ్మెవరం, ఓబన్నపాలెం, మండవవారిపాలెం, ముక్తినూతలపాడు గ్రామాల పొగాకు బేళ్లను వేలానికి తీసుకురావాలని కోరారు.

సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలి

విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్, జేఏసీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారతదేశంలో సుప్రీంకోర్టు బెంచ్‌తో పాటు రెండవ పార్లమెంట్‌ను ఏర్పాటు చేయాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ డిమాండ్ చేశారు. స్థానిక సంతపేటలోని సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో రెండవ పార్లమెంట్‌ను ఏర్పాటు చేసి శీతాకాల సమావేశాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బీఐ అనుబంధ బ్యాంకులలో సిబిల్ స్కోర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ పేరుతో జాతీయసహకార బ్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు. దేశానికి రాజధానిగా ఉన్న ఢిల్లీతో పాటు దేశ రెండవ రాజధానిగా అమరావతిని కేంద్రం ప్రకటించాలని కోరారు. అందుకోసం విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దళిత జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు రెబ్బవరపు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బత్తుల సుబ్బయ్య, అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, జేఏసీ నాయకులు కొమ్ము రాజీవ్, సూర్యసాగర్, కృష్ణ, బెంజిమెన్, ఈస్టర్ పాల్గొన్నారు.

పనిగంటల పెంపును ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కార్మికులపై పెంచిన పది గంటల పనిదినాలను పెంచుతూ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మునిసిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పనిగంటలను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం స్థానిక అద్దంకి బస్టాండులో మునిసిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బి.అరుణ, శ్రీదేవి, డి.వెంకట్రావు, కె.మరియమ్మ, పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: కార్మికుల పనిగంటలను పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బారావు తెలిపారు. మద్దిపాడులో గురువారం ఆయన మాట్లాడుతూ 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచటం తగదన్నారు. 9న జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొనాలని కోరారు.

ప్రతిభ అవార్డులకు ఎంపిక

మద్దిపాడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈవో ఎంవీఆర్.ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దిపాడులోని నారాయణ హైస్కూల్ విద్యార్థులు పాటిబండ్ల వైష్ణవి, కవిల నిస్సిదేదీప్యరాణి, నేతాజీ స్కూల్‌కు చెందిన నైనాల చంద్రకాంత్, కల్లగుంట వెంకటదీప్తి, లింగంగుంట జడ్పీ హైస్కూలుకు చెందిన చినిగే సుశాంత్‌కుమార్, పెద్దకొత్తపల్లి జడ్పీ స్కూల్‌కు చెందిన మోరబోయిన అజయ్‌కుమార్, బసవన్నపాలెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇట్ల పద్మావతిలు అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈవో-2 మేడపల్లి శ్రీనివాసరావులు వెల్లడించారు.


మార్కెట్ యార్డులో మొక్కను నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే కందుల


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


పెద్దారవీడులో మొక్కలు నాటుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు


మొక్కలు నాటుతున్న రేంజ్ అధికారి జీవన్‌కుమార్

మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారం

- వన మహోత్సవంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి
- హరితాంధ్ర కోసం అడుగేద్దాం : ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్ : ఎరిక్షన్‌బాబు

మార్కాపురం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మార్కెట్ యార్డులో, మండలంలోని భూపతిపల్లిగ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వన మహోత్సవ కార్యక్రమంలో భాగంలో గురువారం అధికారులు, నాయకులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగరాజు, టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, మౌలాలి, మున్సిపల్ కౌన్సిలర్ నాలి కొండయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : హరితాంధ్ర సాధన కోసం అడుగులు వేద్దామన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేయాలన్నారు. నాటిన మొక్కను పెరిగే వరకు ప్రతి ఒక్కరూ పర్యవేక్షించాలని అశోక్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెంకటసుబ్బయ్య, అటవీశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నిషాకుమారి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, జడ్పీటీసీ సభ్యుడు మధుసూదన్, మార్కెట్‌యార్డు చైర్మన్ బాలయ్య, సొసైటీ బ్యాంక్ చైర్మన్ బాలీశ్వరయ్య, సయ్యద్ షాన్వాలి, సుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్ తరాలకు భరోసా ఉంటుందని టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అన్నారు. వృక్ష సంపద ఎక్కడ సంవృద్ధిగా ఉంటే అక్కడ నాగరికత అభివృద్ధి చెందుతాయన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని అందరూ నిరోధించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలూరి రామచంద్రారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ నిర్మలాదేవి, ఎంపీడీవో జాన్‌సుందరం, ఏపీవో సుజాత, టీడీపీ నాయకులు గొట్టం శ్రీనివాసులరెడ్డి, రామనారాయణరెడ్డి, చంద్రగుంట్ల నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : నియోజకవర్గంలో లక్ష మొక్కలు నాటి వాటిని కాపాడి పర్యవరణాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ప్రపంచ పర్యవరణ దినోత్సవం, వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో అటవీ శాఖ అధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. అటవీశాఖ అధికారి ఎస్‌వీ సుబ్బారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం వైద్యశాల ప్రాంగణంలో అధికారులు, నాయకులు, ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి అతిథులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యాదాద్రిదేవర, ఎంపీడీవో బండారు శ్రీనివాసులు, ఏపీవో శైలజ, పట్టణ అధ్యక్షుడు పెరుమాళ్ల మల్లికార్జున రావు, టీడీపీ నాయకులు సత్యనారాయణ గౌడ్, ఎంసీహెచ్ మంత్రునాయక్, చిట్యాల వెంగళ రెడ్డి, శనగ నారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జీ మస్తాన్ వలి, రాములు, వైద్యశాల, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : మొక్కలు నాటి బాధ్యతగా పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేసు వెంకట ప్రసాద్ అన్నారు. పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని వాసవీ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పూర్ణ చంద్రరావు, కిశోర్ బాబు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, రామారావు, హర్షిత, శ్రీకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని దోర్నాల రేంజ్ అధికారి జీవన్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖా ఆధ్వర్యంలో గణపతి చెక్‌పోస్టు జీవన్‌కుమార్ గురువారం మొక్కలు నాటారు. జీవరాశి మనుగడ పర్యావరణ పరిరక్షణతోనే సవ్యంగా సాగుతుందని ఆయన అన్నారు.

కంభం, జూన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం బాలికోన్నత పాఠశాలలో ఎంపీడీవో వీరభద్రాచారి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవోలు మాల్యాద్రి, శ్రీనివాసులు, అబ్దుల్ సత్తార్, హెచ్ఎం అమూల్య, వెంకటేశ్వర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ చిన్ని, పద్మావతిదేవి పాల్గొన్నారు.

గిద్దలూరు : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకుని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ నారాయణ, జిల్లాశాఖ ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు, కేవీ చంద్రమోహన్, పుల్లయ్య, సాయిచరణ్, నాగేశ్వరరావు, ప్రవీణ్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేత పాల్గొన్నారు. పాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో కిసాన్ మోర్చా నాయకుడు పిడతల రమేష్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు బాదుల్లా, నరసింహులు, విజయలక్ష్మి మొక్కలు నాటారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అధికారులు 50 మొక్కలు నాటారు. నిత్యం వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని డిపో మేనేజర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. గ్యారేజ్ ఇన్‌చార్జి గురువయ్య, ట్రాఫిక్ ఇన్‌చార్జి మౌనిక పాల్గొన్నారు.

రాచర్ల : మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వి.గిరిధరశర్మ, ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఖాశింబీ, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, ఈవోఆర్డీ ఐ.వెంకటేష్, కార్యాలయ ఏవో కుమార్, ఎస్సై పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : విజయ వాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుద్దకురువ తాండాలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటేశ్వరనాయక్, సంస్థ ప్రతినిధులు మనోజ్ పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

వైసీపీ పీడ విరగడై ఏడాది

కంభం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పీడ విరగడై ఏడాది దాటి, సుపరిపాలన మొదలై సంవత్సరం అయిన సందర్భంగా నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు నాయకత్వంలో జిల్లా కార్యదర్శి లంకా నరసింహారావు ఆధ్వర్యంలో కంభం పట్టణంలో బుధవారం రాత్రి జనసేన పార్టీ వీర మహిళలు ముగ్గులు వవేసి అలరించారు. జగన్‌రెడ్డి అరాచక పాలనను ప్రజలకు తెలియజేసి రాష్ట్రం బాగు కోసం కీలకపాత్ర పోషించడంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి మరువలేనిదన్నారు. ముగ్గులపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ మల్లికార్జున, మండల అధ్యక్షుడు ప్రసాద్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ లక్ష్మీదేవి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ పావనితిరసాల్, మండల నాయకులు రంగనాయకులు, గోళ్ల రమణ, నారాయణ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన ప్రభుత్వ ఉద్యోగులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగే ఏపీజీఈఈఏ మూడో రాష్ట్ర కౌన్సిల్ మహాసభకు మార్కాపురం నుంచి ఆ యూనిట్ ప్రభుత్వ ఉద్యోగులు గురువారం తరలివెళ్లారు. కార్యక్రమంలో మార్కాపురం యూనిట్ అధ్యక్షుడు కొల్లి చెంచిరెడ్డి, కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, కోశాధికారి బుడే సాహెబ్, సభ్యులు కోమలి, ఖాన్, శివకుమార్, శేఖర్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో భూమి సారవంతం

మార్కాపురం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి). పచ్చిరొట్ట ఎరువుతో భూములు సారవంతంగా తయారవుతాయని ఏడీఏ బాలాజీ నాయక్ తెలిపారు.మండలంలోని పెద్ద యాచవరం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రీ ఖరీఫ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయంలో డ్రోన్ వాడకంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలను పంటలు సాగుచేసే ప్రతిరైతు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంఐడీ పీడీ రమణ, ఏవో శ్రీనివాసులు, డాక్టర్ రాజకుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

గిద్దలూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 55 మంది వివిధ అనారోగ్య సమస్యలకు గురై బాధపడుతుండగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పందించారు. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు వెళ్లి సీఎం రిలీఫ్‌ఫండ్‌ను మంజూరు చేయించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం 5వ విడతగా మంజూరైన 56.78 లక్షల రూపాయల చెక్కులను 55 మందికి అందజేశారు. పేదరికంతో అనారోగ్యం భారినపడి ఇబ్బంది పడేవారికి సీఎం రిలీఫ్‌ఫండ్ ఆపన్న హస్తం అందిస్తుందని, కార్పొరేట్ వైద్యం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ షాషావలి, మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, వివిధ మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యోగాంధ్ర మండల స్థాయి పోటీలు

మార్కాపురం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో భాగ్యవతి ఆధ్వర్యంలో మహిళలకు యోగాంధ్ర మండల స్థాయి పోటీలను నిర్వహించారు. యోగా శిక్షకులు చలపతిరావు పోటీలను పర్యవేక్షించారు. గ్రామ స్థాయిలో ముందుగా 10 నుంచి 18 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు, 19 నుంచి 35 సంవత్సరాల లోపువారికి 2 విభాగాలుగా పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పిచ్చయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయలపల్లి గ్రామ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. కొలుకల గ్రామానికి చెందిన గోవిందు, ఎల్లయ్య కుంట హనుమాన జంక్షన్‌కు పనులు నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎదురుగా వస్తున్న బైక్‌పై ఉన్న రాజయ్య, గోవిందు, ఎల్లయ్యకు గాయాలు కావడంతో వారిని ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గోవిందును గుంటూరు తరలించినట్లు బంధువులు తెలిపారు.

గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి శిక్షణ

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 5 : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు అని శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ శాస్త్రి అన్నారు. శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమంలో గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. విశ్రాంత విద్యా ఉపసంచాలకులు డాక్టర్ కే.వీరారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలోప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వినియోగదారుల సంఘం నాయకులు ఓఏ మల్లిక్ మాట్లాడుతూ.. చేతిరాతను అభివృద్ధి చేసుకోవాలని వివిధ పోటీ పరీక్షలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యాస రచన, చేతి రాత, చిత్ర లేఖనం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.


విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ప్రిన్సిపాల్ మధుసూదనశాస్త్రి

పెద్దారవీడు : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని గ్రంథపాలకుడు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులో నిర్వహించి, వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులను అందజేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆవరణలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం ఎంతో ఉపయోగకారకం అన్నారు. ప్రతికలు ప్రతి రోజూ చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లు చలమారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు గురువారంతో ముగిసినట్లు గ్రంథపాలకుడు పీవీ "సుబ్బారెడ్డి తెలిపారు.

రాచర్ల : పుస్తకాలు చదవడం వలన జ్ఞానం లభిస్తుందని విశ్రాంత హెచ్ఎం దప్పిలి ఓబులరెడ్డి అన్నారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిన్నారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త క్రిష్ణవేణి, మాజీ గ్రంథపాలకుడు పాండు పాల్గొన్నారు.

గొడ్డలి వేటును గుర్తుతెచ్చిన 'వెన్నుపోటు దినం'

- జగన్‌రెడ్డి హయాంలో అప్పుల ఊబిలో రాష్ట్రం
- తిరిగి చంద్రబాబు పాలనతో గాడిలోకి
- ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : బాబాయికి గొడ్డలి వేటేసి వెన్నుపోటు దినం పేరుతో వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి ప్రజలకు గుర్తు చేశారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలో జవహర్‌నగర్ కాలనీలో టీడీపీ కార్యాలయంలో గురువారం నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు రూ.50లక్షలు ఖర్చుచేశారని అవగాహన లేకుండా అవాస్తవాలు మాట్లాడడం వైసీపీ నాయకులకు తగదన్నారు. మీ పాలనలో రాష్ట్ర ఖజానాను లూటీ చేసి అప్పుల్లో కూరుకుపోయేలా చేశారని అన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. వైసీపీ నాయకులు దేవుడి భూమిని అన్యాక్రాంతం చేశారని వాటిని అధికారులు గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకోవడం తప్పా అని కందుల ప్రశ్నించారు. లక్ష్మీ చెన్నకేశవ స్వామి భూములను ఆక్రమించిన వారి ఎవరనీ వదిలి పెట్టేది లేదన్నారు. వైసీపీ పాలనలో జరిగిన ఇసుక కుంభకోణంపై అధికారులు విచారిస్తున్నారన్నారు. ఏడాది పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతుండగా, అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదలు సంతోషంగా ఉండడాన్ని చూసి వైసీపీ నేతలు రోడ్లెక్కి నిరసనలు చేయడం సిగ్గుచేటని కందుల అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున, మాలపాటి వెంకటరెడ్డి, మౌలాలి, తాళ్లపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్ కొండయ్య పాల్గొన్నారు.

8న భగవతి భగవాన్ కల్యాణం

గిద్దలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులో గల శ్రీభగవతి భగవాన్ ధ్యానమందిరం ఆవరణలో ఈనెల 8వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు శ్రీపరంజ్యోతి భగవతి భగవాన్ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సేవా సమితి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్ స్టేషన్‌కు భూమిపూజ

పుల్లలచెరువు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు మండలంలోని రంగనపాలెంలో మంజూరైన 220 కేవీ సబ్‌స్టేషన్‌కు టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు గురువారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలకులు హడావుడిగా శంకుస్థాపన చేసినట్లు నటించి ఎలాంటి పనులు చేయలేదన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక పనులు జరిగేలా తాను కృషి చేసినట్లు చెప్పారు. ఇకపై లోవోల్టేజీ సమస్యలు ఉండవని ఎరిక్షన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాద్, కోటయ్య, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

పాఠశాలలకు విద్యా సామగ్రి పంపిణీ

రాచర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో వి.గిరిధరశర్మ అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం విద్యా కిట్లు మంజూరు చేయగా గురువారం ఆయన ఎంఈవో కార్యాలయం నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు తరలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 48 పాఠశాలలు ఉన్నాయని, అన్ని పాఠశాలలకు విద్యా కిట్లు పంపిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం టెస్టుబుక్స్, నోటు పుస్తకాలు, షూలు, బెల్టులు, డిక్షనరీలు, సాక్సులు పంపిణీ చేస్తున్నామని, బ్యాగ్‌లు, యూనిఫామ్‌లు రెండు రోజుల్లో వస్తాయని చెప్పారు. ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు కార్యాలయానికి వచ్చి మెటీరియల్‌ను తీసుకెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాచర్ల జడ్పీహెచ్ఎస్ రామానాయక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పాఠశాలలకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో గిరిధరశర్మ


ముస్తాబైన చెన్నకేశవస్వామి ఆలయం

నేటి నుంచి లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

రాచర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యడవల్లి గ్రామంలో నేటి నుండి శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. 6వ తేది నుండి 11వ తేది వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నామని, వరుసగా బహుమతులు 1.16లక్షలు, 80వేలు, 60వేలు, 40వేలు, 20వేలు, 15వేలు, 10వేలు, 5వేలు విజేతలకు అందిస్తామన్నారు. వివరాలకు 9912349767 సంప్రదించి 1

కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా జావీద్ అన్వర్


అన్వర్

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జావీద్ అన్వర్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రమ శిక్షణ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధికారిక ఉత్తర్వులను అన్వర్ అందుకున్నారు. తనపై నమ్మకంతో పదవి రావటానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ పూర్తి బాధ్యతతో పని చేసి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటానన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు.

ప్రతిభా అవార్డులకు విద్యార్థుల ఎంపిక

కొమరోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభా అవార్డుకు ఎస్‌బీఎస్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ నారాయణయ్య తెలిపారు. టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన షేక్ తహసీన్, వసంత్‌కుమార్, శరణ్య ప్రతిభ అవార్డును అందుకోనున్నట్లు చెప్పారు. వారికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పొదిలి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినికి ప్రతిభా అవార్డు దక్కింది. మండలంలోని చింతగంపల్లి గ్రామానికి చెందిన పోలంరెడ్డి తిరుపతిరెడ్డి, సుబ్బులు దంపతుల కుమార్తె కళ్యాణి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివింది. ఒకేషనల్ ఓఏ గ్రూపు పరీక్షలు రాసిన కళ్యాణి 1000మార్కులకు గాను 954 సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వాసుదేవ్ తెలిపారు. ఈనెల 9న కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అవార్డుతోపాటు, రూ.20వేల నగదును అందుకోనున్నట్లు తెలిపారు.

వంట నిర్వాహకులకు శిక్షణ

కంభం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బాలికోన్నత పాఠశాలలో గురువారం మండలంలోని అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు, సహాయకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని, వంట పోటీలను నిర్వహించారు. ఎంఈవో మాల్యాద్రి అధ్యక్షతన టాటా ట్రస్టు సహకారంతో విజయవాహిని చారిటబుల్ ట్రస్టు ఫౌండేషన్ వారు నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీవో వీరభద్రాచారి ముఖ్యఅతిథిగా హాజరై కుక్ కం హెల్పర్స్‌కు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ డి.రంగారావు, ప్రోగ్రామ్ అసోసియేట్ చెన్ను దివ్యశ్రీ ఆహార బలవర్ధకతను వివరిస్తూ ఫ్లస్‌ఎఫ్ గుర్తు ఉన్న ఉప్పు నూనె, నిత్యావసర సరుకులు వినియోగించడం ద్వారా పోషకాహార లోపాలను నివారించవచ్చన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో రుచి, నాణ్యత, పరిశుభ్రతపై వివరించారు. వంటపోటీలు నిర్వహించి గని వెంకటయ్య స్మారక గ్రంథాలయం ద్వారా విజేతలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు మాల్యాది, శ్రీనివాసులు, హెచ్ఎం అమూల్య, అబ్దుల్‌సత్తార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొమరోలు : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న డొక్కా సీతమ్మ భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవో బీ వెంకటరత్నం అన్నారు. మండల రిసోర్స్‌పర్సన్ కార్యాలయంలో గురువారం కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, రవీంద్రారెడ్డి, పుల్లయ్య, రామాంజి పాల్గొన్నారు.

చెరువు కట్టపై ఆక్రమణలు తొలగించాలి

పుల్లలచెరువు,జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువులోని చెరువు కట్టపై ఆక్రమణలను తొలగించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మరియదాసుకు వినతిపత్రం అందించారు. వెంటనే అధికారులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మేడికొండ రాధకృష్ణ, మేడికొండ అనిల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయలపల్లి గ్రామ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. కొలుకల గ్రామానికి చెందిన గోవిందు, ఎల్లయ్య కుంట హనుమాన జంక్షన్‌కు పనులు నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎదురుగా వస్తున్న బైక్‌పై ఉన్న రాజయ్య, గోవిందు, ఎల్లయ్యకు గాయాలు కావడంతో వారిని ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం గోవిందును గుంటూరు తరలించారు.

పలువురికి జరిమానా, జైలు

గిద్దలూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురికి పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి కె.భరత్‌చంద్ర ఇద్దరికి రూ.10వేల వంతున, మరో ఇద్దరికి 3 రోజులు, ఒకరికి 5 రోజులు జైలు శిక్షను విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు అర్బన్ సీఐ కె.సురేష్ తెలిపారు.

లెవెల్ క్రాసింగ్‌పై అవగాహన

గిద్దలూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాములపల్లి రైల్వే గేటు వద్ద రైల్వే శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. గేట్ల వద్ద పట్టాలు దాటే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, గేటు వేసినపుడు రైలు, గూడ్స్ వెళ్లే వరకు ఆగాలని సూచించారు. కొందరు పాదచారులు గేటు నుంచి ఒంగి హడావిడిగా గేటు దాటుతున్నారని, అనుకోని సందర్భాలలో ప్రమాదాలకు గురవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి, సబ్ ఇన్‌స్పెక్టర్ శేషయ్య, ఇంజనీరింగ్ సిబ్బంది భాస్కర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


రైల్వే గేటు వద్ద అవగాహన కల్పిస్తున్న ఆర్‌పిఎఫ్ సిబ్బంది

మొక్కలునాటి సంరక్షించాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీనరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిద ఉన్న సర్వ జీవరాసుల మనుగడకు మొక్కలే ప్రాణధారమని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. పాఠశాలల్లో విరివిరిగా మొక్కలు నాటి ఉద్యానవనంలా తీర్చిదిద్దాలన్నారు. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ ఈఏడాది అటవీశాఖతో కలిసి 25 లక్షల మొక్కలను పెంచుతున్నట్లు చెప్పారు. వీటిని నాటేందుకు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. నాటిని మొక్కల సంరక్షణకు నిధులు కూడా అందజేస్తామని చెప్పారు. పొలాల్లో గట్లు వెంబడి, పంచాయతి స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఉపాధి హామీ పథకం



పామూరు:: ఎల్ఎన్‌పురంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి



దర్శిలో మొక్కలు నాటుతున్న డాకర్ గొట్టిపాటి లక్ష్మి

కింద నియోజకవర్గంలో రూ.16 కోట్లతో సిమెంట్ రోడ్ల పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, టీడీపీ మండల, గ్రామ కమిటీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, బత్తుల మస్తాన్‌రావు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, సర్పంచ్ విజయ్‌శేఖర్, హెచ్ఎం సయ్యద్ ఈసాక్, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, డీఆర్వో వెంకటసుబ్బయ్య, ఏపీడీ భాస్కరరావు, ఏపీవో బి.మాల్యాద్రి, ఏపీఎం జి.విద్యాసాగర్, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని దూబగుంట గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్రం, హెల్త్‌క్లినిక్ కేంద్రాలతో పాటు రూ.3.10 కోట్ల నాబార్డు నిధులతో నిర్మాణం చేసిన తారు రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, పంచాయతీరాజ్ ఏఈ మస్తాన్‌వలి, ఉపసర్పంచ్ కందుల శ్రీనువాసులు, దైండే శివశంకర్, బి.జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

దర్శి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి-కురిచేడు రోడ్డులోని ఎంఎస్ఎంఈ పార్క్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆమె మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భావితరాల కోసం వృక్ష సంపదను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం కోటి మొక్కల పెంపకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏ పీడీ లలితకుమారి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, రూరల్ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు గొర్రె సుబ్బారెడ్డి, గుర్రం బాలకృష్ణ, కల్లూరి సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని శేషంవారిపాలెంలో శ్రీసీతారామ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఈకార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, సానె సుబ్బయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు మొక్కలు నాటాలి

ముండ్లమూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో సునీత అన్నారు. గురువారం స్థానిక ఉపాధి హామీ పథకం, వెలుగు కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, ఏపీవో టి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని శంకరాపురంలో సర్పంచ్ కూరపాటి మహేశ్వరి, నారాయణ స్వామి మొక్కలు నాటారు. ప్రతి సచివాలయం వద్ద సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

దొనకొండ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక బేతేల్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించడం వల్ల భవిష్యత్తు తరాలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, ఎస్.వెంకటరావు, సుభాషిణి, గ్రేస్‌రత్నకుమారి, దేవానంద్, పొట్ల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోడి అంజనేయులు, సర్పంచ్ గ్రేస్‌రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా హనుమంతరావు బాధ్యతల స్వీకరణ

పీసీపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి ఎంపీడీవోగా హనుమంతరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కనిగిరి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రభాకరశర్మ కనిగిరికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన హనుమంతరావును డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

చిల్లచెట్లు తొలగింపు

పామూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోపాడు రిజర్వాయర్ కట్టకు ఇరువైపులా దట్టంగా ఉన్న చిల్లచెట్లను ఇరిగేషన్ అధికారుల ఆదేశాలతో రిజర్వాయర్ సూపర్ వైజర్ ఎం. నరసింహారావు ఆధ్వర్యంలో గురువారం ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించారు. గతంలో కనీసం మోటార్ సైకిల్ సైతం కట్టపై వెళ్లెందుకు వీలులేకుండా ఇరువైపుల దట్టంగా చిల్లచెట్లు మొలచిఉన్నాయి. గత రెండు రోజుల నుండి చిల్లచెట్లు తొలగించే పనులు చేపట్టినట్లు ఏఈ ప్రసాదరావు తెలిపారు.

లక్ష్మమ్మ మృతి బాధాకరం

పామూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమరకట్టకిందపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు మన్నే లక్ష్మమ్మ బుధవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి గురువారం ఉదయం లక్ష్మమ్మ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. యారవ శ్రీను కుటుంబసభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు వెంగయ్య, మాజీ ఎంపీపీ పెదఅల్లారయ్య, బొల్లా నరసింహారావు, ఇర్రి కోటిరెడ్డి, గోళ్ల వీరబాబు, తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

ముండ్లమూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కెరకొండాయపాలెం గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన కె.తిరుపతిరెడ్డి ఇటీవల కులం పేరుతో దూషించటంతో ఎస్ఐ కె.కమలాకర్ కేసు నమోదు చేశారు. దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ గురువారం కొక్కెరకొండాయపాలెం గ్రామం సందర్శించి బాధితురాలిని విచారించారు. త్వరలోనే నిందితుడిని అరెస్టు చేస్తామని చెప్పారు. ఆయన వెంట ఎస్ఐ కమలాకర్ ఉన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

పామూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకపాడు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ రోడ్డు మార్జిన్‌లో పడిపోయాడు. వరంగల్ ప్రాంతానికి చెందిన ఎద్దుల నారాయణ(52) గుంటూరు నుంచి మదనపల్లికి ట్రాక్టర్‌పై వెళుతున్నాడు. ఈక్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. కనిగిరి నుంచి పామూరు వస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్, సీఐ ఎం.భీమానాయక్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు గమనించారు. క్షతగాత్రుడిని ముఖంపై నీరుచల్లి స్పృహలోకి వచ్చితర్వాత నీళ్లు త్రాపించి పోలీస్ వాహనంలో పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి తమ మానవత్వం చాటుకున్నారు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

నేడు పూరిమెట్లలో విగ్రహ ప్రతిష్ఠ

ముండ్లమూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరిమెట్ల గ్రామంలో కోటి రూపాయల విరాళాలతో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవం శుక్రవారం వైభవంగా జరగనుంది. ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామంగా ఉండటంతో ఆలయం నిర్మించేందుకు గ్రామస్థులు ముందుకు రాలేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామంలోని పుట్టి పెరిగి వివిధ ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో రాణిస్తున్న యువత ఆలయం నిర్మించేందుకు సిద్ధమయ్యారు. ప్రతిఒక్కరూ విరాళాలు ఇవ్వటంతో వారినిచూసిన గ్రామంలోని అన్ని సామాజిక వర్గాలవారు సైతం తమవంతు బాధ్యతగా విరాళాలు ఇచ్చారు. దీంతో కోటి రూపాయల విరాళాలతో ఆలయాన్ని తీర్చిదిద్దారు. గత



పామూరు: డీఎస్పీని పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు

మూడు రోజుల నుంచి పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. శుక్రవారం నూతనంగా నిర్మించిన అమ్మవారి ఆలయంలో పోలేరమ్మ, అంకమ్మ, నాంచారమ్మ దేవతా మూర్తులను ప్రతిష్ఠించనున్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

పామూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని శ్రీ మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సుప్రభాతసేవ, సూర్య నమస్కారాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణచేసి స్వామివార్లకు నూతన పట్టువస్త్రాలు, మహానైవేద్యం సమర్పించారు. రాత్రి అంకురోహరణ, నిత్యహోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ప్రధానఅర్చకులు నారాయణం సత్యబాబు, గోపాలచార్యులు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఆకుమళ్ల చలపతిరావు, ఆలయ ఈవో నరసింహబాబు, కురిమేటి బాలసుబ్రమణ్యం, డాక్టర్ దీక్షితులు, తదితరులు పాల్గొన్నారు. కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, పామూరు సీఐ ఎం.భీమానాయక్ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వారిని పూర్ణకుంభంతో ఈవో నరసింహబాబు, ఆలయ అర్చకులు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగిసిన పెద్దమ్మ తిరునాళ్ల

సీఎస్‌పురం(పామూరు), జూన్ 5 (ఆంధ్రజ్యోతి):



ముండ్లమూరు: పూరిమెట్లలో ముస్తాబైన పోలేరమ్మ ఆలయం

రాచూరి పెద్దమ్మ తిరునాళ్ల వేడుకలు గురువారం ముగిశాయి. ఉదయం దేవస్థానం వద్ద భక్తులు, పొంగళ్లు, గండదీపాలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎండ్లబల ప్రదర్శన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటుచేశారు. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎం.భీమానాయక్, ఎం.వెంకటేశ్వరనాయక్ శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పామూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో మన్నేపల్లి వంశస్థుల ఆధ్వర్యంలో శ్రీనాగర్పమ్మతల్లి నూతన ఆలయ నిర్మాణానికి గురువారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, కోటపాటి వెంకటేశ్వర్లు, అర్చకులు కొల్లు రవికిరణ్‌శర్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు.

కల్తీపాలు తయారుచేస్తే కఠిన చర్యలు

» ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు

తాళ్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి హానికల్గించే కల్తీపాలు తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు హెచ్చరించారు. కొందరు అక్రమ సంపాదనకు మార్గం ఎంచుకుని పెట్టుబడి లేకుండా సంపాదించాలన్న తలంపుతో కల్తీపాలు తయారుచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. పలుగ్రామాల్లో కల్తీపాలు తయారు చేస్తున్న కేంద్రాలను గుర్తించేందుకు గురువారం సాయంత్రం పాల కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొందరు పాలకేంద్రాల నిర్వాహకులు అధికంగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో ఎక్కువ పాలు అమ్మి సొమ్ము చేసుకునేందుకు వక్రమార్గాలు ఎంచుకుని కల్తీపాలు తయారుచేసి గతంలో పట్టుబడ్డారని తెలిపారు. పలుగ్రామాల్లో కల్తీపాలు తయారు చేసి విక్రయిస్తుండగా అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసినా మార్పు రావటం లేదన్నారు. గ్రామాల్లో పాలు సేకరించే పాలకేంద్రాలపై ప్రత్యేకదృష్టి సారించినట్లు చెప్పారు. ఎక్కువ పాలు విక్రయించే కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. కల్తీపాలు తయారుచేస్తూ పట్టుబడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో కల్తీపాలు తయారు చేస్తున్నట్లు తెలిస్తే సమాచారాన్ని పోలీసులకు తెలపాలని కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.



పాల విక్రయకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ మల్లికార్జునరావు

ప్రమాదాలకు నిలయం.. రహదారి మలుపు

» పట్టించుకోని అధికారులు

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దొనకొండ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దొనకొండ మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారిలో కస్తూర్బా విద్యాలయంసమీపంలోని రహదారి మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. దొనకొండ ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ నుంచి పది కిలోమీటర్ల దూరంలోని రుద్రసముద్రం గ్రామం వరకు గత టీడీపీ ప్రభుత్వంలో డబుల్‌రోడ్డు నిర్మించారు. ఈమార్గంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, త్రిపురాంతకం, మార్కాపురం తదితర ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. అటువంటి ప్రధాన రహదారిలో కేజీబీవీ సమీపంలోని మలుపు వద్ద చిల్లచెట్లు పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కనిపించపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఆటో బోల్తాపడి దొనకొండకు చెందిన బాలుడు మృతిచెందాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చిల్లచెట్లు తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



చిల్లచెట్లతో మూసుకుపోయిన రోడ్డు మలుపు



దర్శిలో పాల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

పాల కేంద్రాల తనిఖీలు

దర్శి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని పాలశీతల కేంద్రాలను, పాల విక్రయ కేంద్రాలను పోలీసులు గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ సూచనల మేరకు సీఐ వై.రామారావు పర్యవేక్షణలో ఏఎస్ఐ రాంబాబు సిబ్బందితో కలిసి పాలశీతల కేంద్రాలను, పాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. దర్శి ప్రాంతంలో కల్తీపాల తయారీ గతంలో ముమ్మరంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో ఆరోగ్యభద్రత శాఖ అధికారులు పట్టించుకోక పోయినప్పటికీ పోలీసులు వరుస తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలకు స్పందించి పోలీసులు మళ్లీ తనిఖీలు చేశారు. ఈసందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ ఎక్కడైనా కల్తీపాలు విక్రయిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని హరించే కల్తీపాలను తయారుచేస్తే ఉపేక్షించేది లేదన్నారు. పాల వ్యాపారులు స్వచ్ఛమైన పాలను విక్రయించి న్యాయబద్ధమైన వ్యాపారం చేసుకోవాలన్నారు. అక్రమ వ్యాపారాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి

దర్శి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ పి.సంధ్యారాణి అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో గురువారం విత్తన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటలో నాణ్యమైన విత్తనాలను నిల్వ చేసుకొని, ఆ తర్వాత సీజన్‌లో విత్తనాలుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ బాలకృష్ణానాయక్, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో గురువారం ఘనంగా పర్యావరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు పరిశోధన కేంద్రం పరిసరాల్లో ప్రధాన శాస్త్రవేత్త సంధ్యారాణి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు

ముండ్లమూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ హెచ్చరించారు. గురువారం మండలంలోని వేంపాడు, తూర్పుకంభంపాడు, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి, శంకరాపురం గ్రామాల్లో రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 వరకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీలర్లు శ్రీనివాసరావు, నాగసూరి సుబ్బయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

తాళ్లూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్ర భుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశిస్తున్న వి ద్యార్థులకు ఇంటిని మరిపించేలా మధ్యా హ్న భోజనం అం దించాలని ఎం ఈవో -2 ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. తూర్పుగంగవరం జడ్పీహైస్కూల్‌లో గురువా రం మధ్యాహ్న భోజనం మెనూపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన మెనూ ప్రకారం చేయాల్సిన వంటలపై పాఠశాలల్లో పనిచేస్తు న్న కుకింగ్ ఏజెన్సీ మహిళలకు, హెల్పర్లకు పోటీలు నిర్వహించారు. రుచికరంగా నాణ్యతగా భోజనం తయారుచేసిన ఏజెన్సీ మహిళలకు బహుమతులు అందజేశారు.

శివరాంపురం ఏజెన్సీకి ప్రథమ బహుమతి, వెలుగువారిపాలెం యూపీ పాఠశాల ఏజెన్సీకి ద్వితీయ, తూర్పుగంగవరం ఎంపీపీ ఎస్ ఏజెన్సీకి తృతీయ బహుమతులు అందజేశారు. ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా హైస్కూల్ ఆవరణలో పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, శ్రీనివాసరావు, మా రుతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

ముండ్లమూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివిన పలువురు విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన పులికొండ అశ్విని, బి.కీర్తన, కె.బాలకృష్ణ, జి.గాయత్రి, కె.ధనుష్, పి.విజయనాయక్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. ఒకే పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావటం పట్ల ఉపాధ్యాయులు అభినందించారు. వీరందరికీ త్వరలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నారు.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ముండ్లమూరు మోడల్ స్కూల్‌లో 6,7,8, 9, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈనెల 5 నుంచి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 25న ప్రకటిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

సీఎస్‌పురం(పామూరు) జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురంలో శ్రీరాచూరి పెద్దమ్మతల్లి తిరుణాళ్ల వేడుకల్లో భాగంగా గురువారం కాపునాయుడ్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో హుజూర్‌నగర్‌కు చెందిన ఎడ్ల జత 2905 అడుగులు లాగి తన సత్తా చాటాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న ఈ పోటీలను ఆమంచి సోములు, కదిరి ప్రకాష్‌రావు, బొమ్మనబోయిన వెంగయ్య ప్రారంభించారు.

మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ యాదవ్ ఎడ్లజత 2750 అడుగులు, రంగసాయిపల్లెకు చెందిన ఎం వెంకటసుబ్బాంరనెడ్డి ఎడ్లజత 2500, హుస్సేనాపురం రామసుబ్బారెడ్డి జత 2451, బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి జత 2401, నంద్యాల జిల్లాకు చెందిన గోటిక దినేష్ రెడ్డి జత 2323 అడుగులు లాగాయి. ప్రతిభ చాటిన ఎడ్లజతకు నగదు బహుమతులు అందజేశారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

కురిచేడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కురిచేడులో గురువారం సాయంత్రం ఇరువర్గాల యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. కురిచేడుకు చెందిన ఓ యువకుడు సోషల్ మీడియాలో ఓపార్టీకి చెందిన వ్యక్తిపై ఆడియో పోస్టు చేయడంతో మరోవర్గం వారు దాడికి పాల్పడ్డారు. ఈదాడిలో రూత్‌బాబు అనే యువకునికి గాయాలయ్యాయి. దీంతో రూత్‌బాబు వర్గం వారు దాడిచేసిన వారిపై తిరిగి దాడికి పాల్పడటంతో తూమాటి రమేష్ గాయాలయ్యాయి. అతడికి వినుకొండలో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించారు. ఎస్ఐ శివ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతపరచారు. రూత్‌బాబుకు దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించారు. గ్రామంలో గొడవలు జరగకుండా ఎస్ఐ శివ సిబ్బందితో పహారా కాస్తున్నారు.

ఉష్ణోగ్రత (అంచనా) 6-6-2025

	గరిష్టం	కనిష్టం
గుంటూరు	40	28
తెనాలి	40	28
నరసరావుపేట	39	27
బాపట్ల	38	29
రెంటచింతల	40	28
చీరాల	38	29





మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ప్రతిజ్ఞ చేస్తున్న రాజధాని ప్రాంత రైతులు, అధికారులు

ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్

పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత. పర్యావరణాన్ని పరిరక్షించడంలో దేశానికే ఏపీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. 2047 నాటికి 50శాతం పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకుంటాం. వచ్చే పర్యావరణ దినోత్సవం నాటికి రాష్ట్రంలో 5.58 కోట్ల మొక్కలు పెంచాలని సంకల్పించాం. ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికి సవాల్ విసురుతోంది. వర్షాలు తగ్గిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. సాగు ప్రమాదంలో పడింది. ఫ్లోరైడ్ పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ ప్రమాదాల నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలి.

-ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి.. ఆహ్లాదం

- సుందర నగరంగా రాజధాని
- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- ప్రతిఒక్కరూ పది మొక్కలు నాటి.. పెంచాలి
- ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో సీఎం చంద్రబాబు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో కలిసి రాజధానిలో మొక్కలు నాటిన ముఖ్యమంత్రి



రాజధాని ప్రాంతం అనంతవరంలో మొక్కలు నాటుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు

తుళ్లూరు, గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 'దేవతల రాజధానిగా విలసిల్లి ప్రస్తుతం ఆంధ్రుల రాజధాని అయిన అమరావతి భవిష్యత్‌తరాలకు దిక్సూచిగా మారుతుంది. ప్రజా రాజధాని అమరావతిని ఆహ్లాదంగా.. సుందర నగరంగా తీర్చిదిద్దుతాం. మియావాకీ తరహా గార్డెన్లు, చైనా, కొరియా, జపాన్ వంటి దేశాల మొక్కలను పెంచి పచ్చదనంతో రాజధానిని నింపుతాం..' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం తుళ్లూరు మండలం అనంతవరంలో జరిగిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో కలిసి ఏడీసీఎల్ పార్కులో చంద్రబాబు మొక్కలు నాటారు. అనంతరం సభా వేదిక వద్ద పర్యావరణ పరిరక్షణ నిమిత్తం కాలుష్య మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లలోని చేనేత వస్త్రాలతో, అరటి బోదెలతో రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతవరం హైస్కూలులో పదో తరగతి చదువుతున్న బాలిక భూక్యా మాలతి సభికులతో పర్యావరణ పరిరక్షణపై ప్రమాణం చేయించింది. నల్లమల అడవుల్లో 2 లక్షల ఎకరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి కోట్ల సంఖ్యలో విత్తన బంతులను వేసిన అంకారావును ఘనంగా సన్మానించారు. అదే వేదికపై ఆయనను రాష్ట్ర అటవీశాఖ సలహాదారుగా నియమిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. సభలో ముఖ్య మంత్రి ప్రసంగిస్తూ రాష్ట్ర విస్తీర్ణంలో 30.05 శాతం పచ్చదనం ఉందని 2047 నాటికి 50 శాతానికి తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసమే సీడ్ రాఖీ కార్యక్రమంలో ఏటా మహిళలు తమ అన్నదమ్ముల నక్షత్రాలకు చెందిన మొక్కల విత్తనాలతో తయారుచేసిన సీడ్ రాఖీలను కట్టాలని కోరారు. వాటిని నాటి తమకు రక్షణ కల్పించినట్లే ఆ మొక్కలకు కూడా సంరక్షణ కల్పించాలని కోరాలన్నారు. తద్వారా మొక్కల పెంపకంలో మహిళలు కీలక భూమిక పోషించాలన్నారు.

కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం

ఒక్క రోజే కోటి మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందాన్నిస్తోందని చంద్రబాబు తెలిపారు. తడి పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తను ఇంట్లోనే కంపోస్టుగా వినియోగించుకుంటూ టెర్రస్, కిచెన్ గార్డెనింగ్ చేస్తే మంచిదన్నారు. మిగిలిన పొడి వ్యర్థాలను రీసైక్లింగ్, రీయూజబుల్ పద్ధతుల్లో పునర్వినియోగించుకుని కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు.

అంకారావులాగా మొక్కలు నాటతా: పవన్‌కల్యాణ్

ఫారెస్ట్ మ్యాన్ కొమెర అంకారావు కృషిని, సంకల్పాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కొనియాడారు. నల్లమల (మిగతా 6లో)



స్టాల్స్‌లో వస్తువులను పరిశీలిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

బాపట్ల మండలం సూర్యలంక నగర వనంలో లోక్‌సభ ప్యానల్ స్పీకర్ కృష్ణప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ వెంకటమురళి



వన..మహోత్సాహం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా వనమహోత్సవం ఉత్సాహంగా జరిగింది. గ్రామ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున మొక్కలు నాటారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడతాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. బాపట్ల మండలం సూర్యలంక సమీపంలోని నగరం వనంలో అటవీశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ జె.వెంకటమురళితో కలిసి లోకసభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ మొక్కలు నాటి నీరు పోశారు.

-బాపట్ల(ఆంధ్రజ్యోతి)



సీసీ రోడ్డు



కాలువల నిర్మాణం

తీరనున్న బిల్లుల బాధలు

- 'ఉపాధి పథకం' బకాయిల చెల్లింపునకు ఏర్పాట్లు
- మూడు జిల్లాలో రూ.166.46 కోట్లు పెండింగ్
- కేంద్రం నుంచి నిధులు విడుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి మరీ ఉపాధి హామీ పథకం పనులు చేసిన వారికి బిల్లుల బాధలు తీరనున్నాయి. బిల్లులు చెల్లింపునకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వారం రోజుల్లో బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉపాధి పథకం కింద సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, నీటి తొట్లు వంటి పను లను పల్లెల్లో పెద్ద ఎత్తున చేశారు. పనులు పూర్తిచేసి 8 నెలలు గడిచిపోయాయి. పాడి రైతులు నిర్మించుకున్న గోకులాలకు కూడా బిల్లులు చెల్లించ లేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సూమారు రూ.166.46 కోట్ల విలువైన బిల్లులు చెల్లించేందుకు ఏర్పా ట్లు చేస్తున్నారు.

పల్లె పండుగ పథకం ప్రారంభంలో వారం వారం బిల్లుల చెల్లింపులు (మిగతా 6లో)

మృతదేహం ఏపీఎస్పీ కానిస్టేబుల్‌ది

అద్దంకి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతినగర్ వద్ద సరివితోటలోని మృతదేహం ఏపీఎస్‌పీ కానిస్టేబుల్ మందుల మౌలాలీ(27)గా పోలీసులు గుర్తించారు. సీఐ సుబ్బరాజు కథనం మేరకు.. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్లకు చెందిన మందుల మౌలాలి వెంకటగిరి ఏపీఎస్పీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2024లో గుంటూరుకు చెందిన ఫాతిమాతో వివాహం జరిగింది. వివాహం జరిగిన తర్వాత దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఫాతిమా గుంటూరులోనే ఉంటుంది. వెంకటగిరి వెళ్తున్నానని మౌలాలీ ఆదివారం విప్పర్లలోని కుటుంబసభ్యులకు చెప్పి స్కూటీపై బయలుదేరాడు. అద్దంకి మండలం శాంతినగర్ వద్దకు సాయంత్రం సమయంలో వచ్చి స్కూటీని నామ్ రోడ్డు వెంబడి ఉన్న బడ్డీ కొట్టు వద్ద ఆపి సమీపంలోని తోట లోపలకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం తోటలోని చెట్టుకు వెలాడుతన్న మృతదేహాన్ని గుర్తించిన రైతు పోలీసులకు సమాచారం అందించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. అనంతరం స్కూటీని గుర్తించి అందులో ఉన్న పత్రాల ఆధారంగా మృతుడు మౌలాలిగా గుర్తించారు. భార్యతో విభేదాలతో ఆత్మహత్యకు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

లెదర్ పార్క్‌కు.. స్థల పరిశీలన

- వినుకొండలో వెంకుపాలెం.. నకరికల్లులో గుండ్లపల్లికి తైవాన్ బృందం
- ఆసక్తి చూపుతున్న ప్రైమ్ ఏషియా కంపెనీ యూఎస్‌ఏ ప్రతినిధులు

వినుకొండటౌన్, నకరికల్లు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో లెదర్‌పార్క్ ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. తైవాన్ దేశానికి చెందిన ప్రైమ్ ఏషియా(యూఎస్‌ఏ) కంపెనీ లెదర్‌పార్కు ఏర్పాటుకు ఆసక్తి చూపుతోంది. ఈ క్రమంలో ఆ కంపెనీ ప్రతినిధులు వినుకొండ మండలంలోని వెంకుపాలెం, నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో పర్యటించి భూములను పరిశీలించారు. వెంకుపాలెం సమీపంలోని సర్వే నెంబరు 1లో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలోని ప్రభుత్వ భూమిని, గుండ్లపల్లిలో సర్వే నెంబరు 702లో భూముల్ని ఈ బృందంలోని అమెరికన్ వనరుల ఉపాధ్యక్షుడు ఇన్‌షేర్, లెదర్‌పార్కు లీడర్ బ్రైస్లీ, ప్రాజెక్టు మేనేజర్ జేమ్స్‌లకు స్థానిక అధికారులు చూపారు. ఆయా భూముల బ్లూప్రింట్‌తో పాటు నీటి వనరులు తదితరాల గురించి కంపెనీ ప్రతినిధులు అధికా రుల నుంచి వివరాలు తీసుకున్నారు. వెంకుపాలెం సమీపంలోని సింగర చెరువు నీటిని విని యోగించుకోవచ్చని తహసీల్దారు సురేష్ నాయక్, సర్వేయర్ చండీరాణీ చెప్పారు. గుండ్లపల్లిలోని (మిగతా 6లో)



వినుకొండకు సమీపంలోని వెంకుపాలెం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న లెదర్ పార్కు కంపెనీ ప్రతినిధులు

నేను చంపింది మరో మహిళను

ఒక కేసు విచారిస్తుండగా మరో హత్య కేసు వెలుగులోనికి

వేటపాలెం(చీరాల), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 'ఓ మహిళ అనుమానాస్పద మృతి కేసులో అనుమానిత వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తుండగా, అనూహ్యంగా మరో హత్య కేసు వెలుగులోకి వచ్చింది. సదరు నిందితుడు హత్య చేసింది ఆ మహిళను కాదని, మరో మహిళను అని చెప్పడంతో పోలీసులే తెల్లముఖం వేయాల్సి వచ్చింది. దీంతో ముందుగా చనిపోయిన మహిళ ఎవరా అని పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. వేటపాలెంలో జరిగిన ఈ హత్యలు స్థానికంగా సంచలనం కలిగిస్తున్నాయి. వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామం నాగవరపమ్మ గుడి సమీపంలోని కొబ్బరితోటలో ఓ మహిళ అనుమానస్పద స్థితిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేస్తున్న క్రమంలో స్థానిక వినాయకపురానికి చెందిన ప్రమీళ అలియాస్ మౌనిక (30) కనిపించడం లేదని తెలుసుకున్నారు. బహుశా మృతురాలు వారి తాలూకానే అని భావించి పోలీసులు ఆ వైపు దృష్టిసారించారు. భర్త చనిపోవడంతో స్వగ్రామమైన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడులోనే నివసిస్తూ, అప్పుడప్పుడు వినాయకపురంలో అమ్మమ్మ వద్దకు వస్తుంటుందని తెలుసుకున్నారు. ఆమెకు నిజాంపట్నానికి చెందిన ఈగ వెంకటేశ్వర్లుతో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుసుకుని అతడి కోసం గాలింపు చేపట్టారు. ఈ కేసులో అనుమానితుడిగా వెంకటేశ్వర్లు గత నెల రోజులుగా తెనాలి, నిజాంపట్నం, గుంటూరు ప్రాంతాల్లో ఉంటూ నిత్యం సిమ్‌లు మారుస్తూ ఎవరి కంటా పడకుండా పోలీసులకు చుక్కలు చూపించాడు. చీరాల రూరల్ సీఐ పంతగాని శేషగిరిరావు సాంకేతిక పరిజ్ఞానంతో బుధవారం అతడ్ని నిజాంపట్నంలో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



మౌనిక హత్య జరిగిన బొంగుల తోట

మరో హత్య వెలుగులోనికి...

పోలీసులు విచారణ చేసే క్రమంలో నిందితుడు తాను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. అయితే అతడు చెప్పిన సమాధానాలు, అక్కడ మృతదేహం వద్ద ఆనవాళ్లకు పొంతన కుదరడం లేదు. దీంతో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం కొబ్బరితోటకు తీసుకురాగా తాను హత్యచేసింది మరో ప్రదేశంలో అనిచెప్పడంతో పోలీసులు నివ్వెరపోయారు. కొబ్బరితోటకు సమీపంలోని వెదురుబొంగుల తోట వద్దకు తీసుకెళ్లి అక్కడ ఓ మహిళను హత్య చేసి మృతదేహాన్ని పూడ్చినట్లు చెప్పాడు. గతంలో ఇద్దరికి సంబంధాలు ఉన్నప్పటికీ గ్రామంలో ప్రమీళ అలియాస్ మౌనిక అవమానాలకు గురిచేసిందన్నారు. దీంతో ఆమెను హతమార్చినట్లు చెప్పాడు. ఈ సమయంలో వెంకటేశ్వర్లు పరారయ్యే ప్రయత్నం చేయగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే అతడితో పాటు మరొక నిందితుడ్ని కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

శ్రీనాథ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి



నల్లబర్లీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి గొట్టిపాటిని కోరుతున్న రైతులు

పంగులూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు తలపనేని శ్రీనాథ్ కుటుంబాన్ని ఆదుకుంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. మండలంలోని జనకవరం గ్రామంలో గత నెల 23న ఆత్మహత్య చేసుకున్న శ్రీనాథ్ కుటుంబ సభ్యులను మంత్రి గురువారం పరామర్శించారు. శ్రీనాథ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనాథ్ కుటుంబానికి బీమా సాయంతో పాటు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పిల్లలను చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. మండలంలోని కొండమూరు, చందలూరు గ్రామాల పరిధిలో పలు బాధిత కుటుంబాలను మంత్రి పరామర్శించారు. మంత్రి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బా రావు, కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేఖర్, చింతల సహదేవుడు, కాటా అంజయ్య, అల్లంనేని స్వామి, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, పంగులూరు డీసీ అధ్యక్షుడు కుక్కపల్లి ఆంజనేయులు, బాచిన హరిబాబు, మస్తాన్‌వలి, సర్పంచ్ కృష్ణారావు, ము రకొండ సుబ్బారావు, ఆదిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నార్నె సుబ్బా రావు, సిద్ధూ, గుర్రం వెంకటరావు, చౌదరిబాబు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

పంగులూరు మార్కెట్ యార్డులో నల్లబర్లీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి గొట్టిపాటిని చందలూరులో రైతులు కోరారు. మంత్రి మాట్లాడుతూ పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు ప్రాంతాలలో పొగాకు నిల్వలు అధికంగా ఉన్నందున ఆ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు అడ్డగడ సతీష్, అడ్డగడ సుబ్బయ్య, రావూరి రమేష్, పెంట్యాల వెంకటేశ్వర్లు, నార్నె శ్రీనివాసరావు,ఏడుకొండలు, రామాంజనేయులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం

వేటపాలెం(చీరాల), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాకు తాత్కాలిక అంతరాయం కలుగుతోందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెం ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో అక్కయ్యపాలెం, లక్ష్మీపురం ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మంకెనవారిపాలెం, రామనగర్, చెన్నబజార్, రెడ్డిబజార్, రైల్వే స్టేషన్ రోడ్డు, లైబ్రరీ రోడ్డు, వేటపాలెం గడియార స్థంభం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. అనంతరం యథావిధిగా విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

ఇంకొల్లు : మండలంలోని ఇడుపులపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని వంకాయలపాడు ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఈ రోజు శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు. వంకాయలపాడు, పూసపాడు, సుబ్బారెడ్డిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నివేదిత విద్యార్థులకు ప్రతిభా పురస్కారం

ఇంకొల్లు, జూన్ 5,(ఆంధ్రజ్యోతి) : 2024-25వ విద్యాసంవత్సరానికి గాను 10వ తరగతి ప్రతిభ అవార్డులకు ఇంకొల్లు నివేదిత హైస్కూల్ విద్యార్థులు మాదాల సిద్ధార్థ, కుమ్మరి అమిత్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయులను, విద్యార్థులను గురువారం ఆ పాఠశాల చైర్మన్ సుబ్బారావు, అకడమిక్ డైరెక్టర్ సుబ్బరామిరెడ్డి అభినందించారు.

ప్రతిభా పురస్కారానికి కొప్పెరపాడు విద్యార్థుల ఎంపిక

బల్లికురవ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు నాగచరణ్ తేజ, మాదాల హేమ స్రవంతి లను ప్రభుత్వం ప్రతిభ పురస్కారాలకు ఎంపిక చేసిందని హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఇద్దరు విద్యార్థులు చదువులో రాణించడంతో ప్రభుత్వం జనరల్ కేటగిరిలో ప్రతిభ పురస్కారానికి ఎంపిక చేసిందన్నారు. వీరికి రూ.20 వేల నగదు అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

ప్రతిభా అవార్డులకు విద్యార్థుల ఎంపిక

మార్టూరు, జూన్5 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో రాయల్ జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్‌లో జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ఓబులశెట్టి దిలీప్ (989)బద్దేటి అనూహ్య (964)అనే ఇద్దరు విద్యార్థులు ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వీరగంధం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.20 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం, పతకం ఇస్తామన్నారు.

విద్యామిత్ర కిట్లు అందజేత

ఇంకొల్లు, జూన్ 5,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలోని పాఠశాలలకు సర్వేపల్లిరాధాకృష్ణన్ కిట్లు అందజేత కార్యక్రమం గురువారం ప్రారంభించి నట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. 1848 బెల్ట్స్, 1386 బ్యాగ్‌లు, 2479 షూస్ 14462 నోట్‌బుక్స్, 2545 యూనిఫాంలు,494 నిఘంటువుల 12238 టెస్ట్‌బుక్స్ వచ్చాయన్నారు. మండలంలో అన్ని పాఠశాలలకు గురువారం, శుక్రవారం అందజేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం అన్ని పాఠశాలలకు అందజేసే ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

రూఫ్‌టాప్ సోలార్‌పై అవగాహన

అద్దంకి, జూన్5 (ఆంధ్రజ్యోతి): ఇళ్లపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రజలలో అవగాహన కల్పించాలని మున్సిపల్ రవీంద్ర అన్నారు. సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రజలలో అవగాహన పెంచేందుకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో కౌన్సిలర్లు, టీడీపీ నేతలతో కమీషనర్ రవీంద్ర, సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ ప్రవేట్ లిమిటెడ్ ప్రతినిధి చం ద్రశేఖర్ లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ రవీం ద్ర మాట్లాడుతూ సోలార్ యూనిట్ లు ఏర్పాటు తో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఇళ్లకు వినియోగించే విద్యుత్ బిల్లుల నుండి ఉపశమనం కలుగుతుందన్నారు. ఇళ్లపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని, మిగిలిన మొత్తానికి బ్యాంకుల నుండి రుణం తీసుకునే అవకాశం ఉందన్నారు. వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్లు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి

వేటపాలెం(చీరాల), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అక్కయ్యపాలెం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన తల్లీ కొడుకుల్లో కుమారుడు మృతిచెందాడు. చీరాల శాంతి నగర్‌కు చెందిన ఐనంపూడి రత్నకుమారి కుటుంబంతో వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెంలో కోళ్ల పెంపకం వద్ద ఉంటున్నారు. ఇదిలా గతనెల 28న ద్విచక్ర వాహనంపై కుమారుడితో తల్లి చీరాల వైపుకు వస్తుండగా చీరాల నుంచి ఒంగోలుకు వెళుతున్న కారు వీరిని వేగంగా ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ గాల్లోకి ఎగిరి పొలాల్లో పడ్డారు. దీంతో తల్లికి కుడి కాలు పూర్తిగా దెబ్బతింది. అలాగే కుమారుడికి కుడి కాలు, చేయి తీవ్రంగా దెబ్బతిన్నాయి. స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్న కుమారుడు జ్యోయల్ గురువారం మృతి చెందినట్లు వేటపాలెం పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేశారు. తల్లి చికిత్స పొందుతోంది.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

బల్లికురవ. జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాంజనేయ పురం గ్రామంలో గురువారం నాగిపోగు యేసురత్నం అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. అందిన సమాచారం మేరకు రామాంజ నేయపురం గ్రామంలో యేసురత్నానికి చెందిన స్థలం కొంతకాలం నుంచి వివాదంలో ఉంది. దీంతో అయన పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అయనను వారి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


రోడ్డు అంచులో పడిపోయిన కృష్ణ

పంగులూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలం లోని 16వ నెంబరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని మరో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొంది. దీంతో వ్యక్తికి కాలు విరిగిన ఘటన గురువారం చోటు చేసుకొంది. అందిన సమాచారం మేరకు మార్టూరు పట్టణానికి చెందిన వసంత కృష్ణ గురువారం ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళుతుండగా అదే రహదారిలో వేగంగా వెళుతున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో టీడీపీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఘటనలో వసంత కృష్ణ ఎడమకాలు ఎముక విరిగి తీవ్రగాయమైంది. గాయపడిన వ్యక్తిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ వినోద్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లపై గుంతలనైనా పూడ్చరూ..!



యనమదల నుంచి యద్దనపూడి వరకు ఉన్న రోడ్డు, మార్టూరు నుండి దండుదారి వరకు గుంతలు మయంగా ఉన్న రోడ్డు

కనీసం మరమ్మతులైనా చేయాలని వినతి

యద్దనపూడి (మార్టూరు) జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

యద్దనపూడి మండలంలో ముఖ్యంగా గన్నవరం నుంచి పూనూరు గ్రామాల మధ్య రహదారి సక్రమంగా లేకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. అదేవిదంగా యనమదల నుంచి యద్దనపూడి గ్రామం వరకు సింగిల్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు కారణంగా ద్విచక్రవాహనదారులు, కార్లు, ఆటో వాలాలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రావెల్ ను తరలించే భారీటిప్పర్ల కారణంగా రోడ్డుపై భారీగుంతలు పడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేగాకుండా యద్దనపూడి నుంచి వింజనంపాడు రోడ్డు కూడా వాహనచోదకులకు ఇబ్బందిగా ఉంది. ఇక మార్టూరు వాగుపై ఉన్న వంతెన నుంచి గన్నవరం రోడ్డులో దండు దారి వరకు రోడ్డు పూర్తిగా గోతుల మయమైంది. రోజూ నిత్యం వాహనాలు తిరిగే ఈ రహదారులపై ప్రయాణిస్తున్న ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయవలసిన అవసరం ఉంది. ప్రజానీకం కూడా గోతులను పూడ్చివేసి ప్రయాణికులకు ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సంబందిత అధికారులను కోరుతున్నారు.

వైభవంగా హనుమసాయి కుటీర 18వ వార్షికోత్సవం

చినగంజాం, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : చినగంజాంలోని హనుమసాయి కుటీరంలోని షిరిడి సాయిబాబా మందిరంలో 18వ వార్షికోత్సవ పూజలు గురువారం వైభవంగా నిర్వహించారు. షిరిడి సాయిమందిరంలో వేంచేసిన మహాగణపతి, దత్తాత్రేయ, ధ్యానాంజనేయ, సుబ్రహ్మణ్యస్వామి సహిత సాయిబాబా వారి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ 18వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. వేకువజామున బాబా చిత్రపటంతో చిన గంజాం వీధులలో భక్తులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి సాయినాథునికి సుప్రభాత సేవ, కాకడహారతి నిర్వహించి, తదనంతరం విఘ్నేశ్వర పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో సాయినాథుని నూతన వస్త్రాలతో, పలురకాల పూలమాలలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం పుణ్యాహవాచన. మంటపారాధన, బాబా వారికి ఆస్థాన పరివార దేవతలకు పంచామృత మహన్యాస పూర్వక అభిషేక కార్యక్రమాలు, అలంకారములు, సహస్ర నామార్చన, నివేదన, హారతి తదితర పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ధునిలో కొబ్బరికాయలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాగంణంలో మధ్యాహ్నం రెండు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. శ్రీహనుమసాయి కుటీర ట్రస్టు సభ్యులు, అంకిత సాయి భక్తులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

మేదరమెట్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ సమాజంలో అందరి బాధ్యతని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. గురవారం మండలంలోని రావినూతలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా రావి నూతలలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, గతంలో జగన్ ఎక్కడికి వెళ్లినా మొక్కలు నరికి విధ్వంసం సృష్టించారున్నారు. తమది మొక్కలు నాటే ప్రభుత్వమన్నారు. పర్యావరణ హితం కోసం కోట్లాది మొక్కలు నాటాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా ఒక్క మొక్కనైనా నాటాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల మొక్కల సంరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. మొక్కలు నాటడం వల్ల వర్షాలు అధికంగా కురిస్తాయన్నారు. మొక్కలు నాటడంపై అందరూ మక్కువ పెంచుకోవాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచి విజయ వీణ, టీడీపీ నాయకులు కారసాల నాగేశ్వరరావు(బాబు), మోపర్తి లక్ష్మీనారాయణ, పిన్నక హనుమయ్య, కే.గురుబాబు, ప్రసాద్ కుమార్, సుబ్బయ్య పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న మంత్రి రవికుమార్

పలువురికి మంత్రి పరామర్శ

మేదరమెట్ల : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తమ్మవరం టీడీపీ నాయకుడు కరిచేటి రాంబాబు సోదరుడు వెంకటరావు మృతి చెందాడు. గురువారం రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ తమ్మవరంలోని వెంకటరావు కుటుంబ సభ్యులను వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు మండలంలో ఆయన పలు వివాహ కార్యక్రమాలకు హాజరయ్యారు.

గిట్టుబాటు ధరల కోసం పొగాకు రైతుల నిరసన

నోబిడ్‌లు నివారించాలి

లోగ్రేడ్‌ను కొనుగోలు చేయాలని డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఒంగోలు(రూరల్), జూన్5(ఆంధ్రజ్యోతి): ఒం గోలు పొగాకు వేలంకేంద్రం-2లో రైతులు గిట్టు బాటు ధరల కోసం గురువారం వేలం ప్రక్రియ ను నిలుపుదల చేశారు. అనంతరం నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. సుమారు రెండు గంటల పాటు వేలాన్ని నిలుపుదల చేసి తమకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎఫ్-2రకం కూడా అతి తక్కువగా కిలో రూ.220కు కొనుగోలు చేయడం దారుణంగా ఉం దన్నారు. నాణ్యమైన పొగాకు ను కూడా నోబిడ్ చేశారని ఆరోపించారు. లోగ్రేడ్‌లు, మధ్య ర కం బేళ్లను అతి తక్కువ ధరలకు కొనుగోలు చే యటంపై ఆవేదన వ్యక్తం చేశారు. బోర్డు ఆర్ ఎం ఎం.లక్ష్మణరావు, వేలం నిర్వహణాదికారి జె.తులసిలను వారు ప్రశ్నించారు. దీంతో వారు స్పందిస్తూ అధిక ధరలకు కొనుగోలు చేయాలని వ్యాపారులతో ఎప్పటికప్పుడు సమావేశాలలో చె బుతున్నట్లు చెప్పారు. నోబిడ్‌లు నివారించటాని కి పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తున్నాయని తెలిపా రు. వేలం నిర్వహణాధికారి తులసి మాట్లాడు తూ పొగాకు వేలం ప్రక్రియ నిలుపుదల చేయ డం సాధ్యం కాదన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాలు ఉంటేనే వేలం నిలుపుదల చేస్తామని తేల్చి చెప్పడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు గ్రామాల రైతుల పొగాకును వేలంలో ఉంచారు. అనంతరం వేలం తిరిగి ప్రారంభమైంది.

3 బేళ్లు మాత్రమే తీసుకురావాలి

పొగాకు రైతులు 6వ తేదీ నుంచి బ్యారన్‌కు మూడు బేళ్లు మాత్రమే తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి జె.తులసి ఒక ప్రకటనలో తెలిపారు. 8వ రౌండ్ షెడ్యూల్ ప్రకారం 6వ తేదీన పోతవరం, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డిపాలెం, కె.మామిడిపాలెం, యరజర్ల, చెరురువు కొమ్ము పాలెం, 9న ఒంగోలు, గుత్తికొండవారిపాలెం, అనుబ్రోలువారిపాలెం, కేశినేనివారిపాలెం, ప్రాసంగలపాడు, ఉప్పుగుండూరు, చదలవాడ, కొప్పోలు, సూరారెడ్డిపాలెం, 10న అమ్మనబ్రోలు, చవటపాలెం, రాపర్ల, మాచవరం, 11న నాగులుప్పలపాడు, ఒమ్మెవరం, ఓబన్నపాలెం, మండవవారిపాలెం, ముక్తినూతలపాడు గ్రామాల పొగాకు బేళ్లను వేలానికి తీసుకురావాలని కోరారు.

సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలి

విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారతదేశంలో సుప్రీంకోర్టు బెంచ్‌తో పాటు రెండవ పార్లమెంట్‌ను ఏర్పాటు చేయాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ డిమాండ్ చేశారు. స్థానిక సంతపేటలోని సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో రెండవ పార్లమెంట్‌ను ఏర్పాటు చేసి శీతాకాల సమావేశాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బీఐ అనుబంధ బ్యాంకులలో సిబిల్ స్కోర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ పేరుతో జాతీయసహకార బ్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు. దేశానికి రాజధానిగా ఉన్న డిల్లీతో పాటు దేశ రెండవ రాజధానిగా అమరావతిని కేంద్రం ప్రకటించాలని కోరారు. అందుకోసం విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దళిత జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు రెబ్బవరపు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బత్తుల సుబ్బయ్య, అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, జేఏసీ నాయకులు కొమ్ము రాజీవ్, సూర్యసాగర్, కృష్ణ, బెంజిమెన్, ఈస్టర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్, జేఏసీ నాయకులు

పనిగంటల పెంపును ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కార్మికులపై పెంచిన పది గంటల పనిదినాలను పెంచుతూ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మునిసిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాం డ్ చేశారు. పనిగంటలను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం స్థానిక అద్దంకి బ స్టాండులో మునిసిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బి.అరుణ, శ్రీదేవి, డి.వెంకట్రావు, కె.మరియమ్మ, పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: కార్మికుల పనిగంటలను పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బారావు తెలిపారు. మ ద్దిపాడులో గురువారం ఆయన మాట్లాడుతూ 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచటం తగదన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ఒంగోలు క్రైం, జూన్5(ఆంధ్రజ్యోతి): యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన ఒంగో లులోని రైల్వేస్టేషన్ సమీపంలోని కేవీఆర్ లాడ్జి ఎదు రు జరిగింది. సుమారు 30 ఏళ్ల వయస్సు గల గు ర్తుతెలియని యువకుడు గురువారం మృతి చెంది ప డి ఉన్నాడు. ఎలాంటి గాయాలు శరీరంపై కనిపించ డం లేదు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొ రకలేదని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. దీంతో మృతదేహన్ని రిమ్స్‌లో భద్రపరుస్తున్నామని, వివరాలు తెలిసిన వారు 9121102124 సెల్‌నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

బీమా నమోదుతో అధిక ప్రయోజనాలు


చెక్కు అందజేస్తున్న మేనేజర్ శీనానాయక్

బల్లికురవ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పలు రకాల బీమా పథకాలలో నమోదైన వారు ధీమాగా జీవనం సాగించవచ్చని, బల్లికురవ ఏపీజీబీ బ్యాంకు చీఫ్ మేనేజర్ కె. శీనానాయక్ పేర్కొన్నారు. మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన జాగర్లమూడి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో రూ.20 రుపాయిల ప్రీమియం చెల్లించాడు. దీంతో ప్రభుత్వం నుంచి బ్యాంకు ద్వారా రూ.2 లక్షలు మంజూరైంది. ఈ నగదును గురువారం బ్యాంకు మేనేజర్ శీనానాయక్ మృతుడికి నామినిగా ఉన్న అయన భార్య శ్రీదేవికి నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో ఖాతా కలిగి ఉన్న ప్రతి వ్యక్తి బీమా పథకాలలో నమోదు చేయించుకోవాలన్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా ఖాతాదారులు మృతిచెందితే వారికి వెంటనే నగదు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రవీంద్రబాబు, అసిస్టెంట్ మేనేజర్లు బిందు మాధవి పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం


విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ ఆత్మారావు

చినగంజాం, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఎస్.నరసింహారావులు అన్నారు. శాఖా గ్రంథాలయం చినగంజాంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. 2025 ఏప్రిల్ 28వ తేదీ నుంచి విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకులు ఏ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు కంప్యూటర్, పుస్తక పఠనం, పెయింటింగ్, యోగ తదితర విషయాలలో రిసోర్సుపర్సన్ల శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రామ సర్పంచ్ సూచించారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో పాల్గొన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లు, వివిధ పోటీలలో విజేతలైన వారికి బహుమతులను గ్రామ సర్పంచ్, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు అందజేశారు. వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, స్నాక్స్, శీతల పానీయాలులను దాత రిటైర్డ్ ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ జగన్నాథరావు అందజేసినట్లు గ్రంథపాలకులు తెలిపారు. గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు వై.రామాంజనేయులు, పి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పల్లపోలు లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు




లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి

ఒంగోలు(రూరల్), జూన్5 (ఆంధ్ర జ్యోతి): మచిలిపట్నంలో ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే జాతీ యస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ఇరు వురు జిల్లా క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గురువారం ఒంగోలులో క్రీడాకారులు లక్ష్మారెడ్డి, రా జశేఖర్‌రెడ్డిని జిల్లా కబడ్డీ అసోషియో షన్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో అసోషియోన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, చైర్మన్ ఎన్.చంద్ర మోహన్‌రెడ్డి, కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, కోశాధికారి డి.రమేష్‌బాబు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శిరిగిరి రంగారావు, గడ్డం శ్రీనివాసరావు, కొన్నె ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న బిల్లుల బాధలు

(5వ పేజీ తరువాయి)

జరిగాయి. మొదటి రెండు వారాలు చెల్లింపులు సక్రమంగా జరిగాయి. బిల్లులు వెనువెంటనే వస్తాయనే ఆశతో పెద్ద ఎత్తున పనులు చేశారు. పల్నాడు జిల్లాలో రూ.90.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.62.18, గుంటూరు జిల్లాలో రూ.13.79 కోట్లు బిల్లుల బకాయిలున్నాయి.

గోకులాల బిల్లుల పరిస్థితి అలానే ఉంది. పల్నాడు జిల్లాలో 702, బాపట్ల జిల్లాలో 691, గుంటూరు జిల్లాలో 383 షెడ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో పల్నాడులో 513, బాపట్లలో 539, గుంటూరులో 259 పూర్తి అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మిగిలిన షెడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. విడతల వారీగా బిల్లులు చెల్లింపులు లేకపోవడంతో షెడ్ల నిర్మాణాలను పాడి రైతులు నిలిపివేశారు. అధిక శాతం షెడ్లు నాలుగు నుంచి ఆరు పశువుల యూనిట్ల నిర్మాణం చేపట్టారు. దాదాపు మూడు జిల్లాల్లో రూ.19 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు ఉపాధి హామీ అధికారుల లెక్కలు తెలియజేస్తున్నాయి. గోకులాల బిల్లులు కూడా త్వరలోనే చెల్లించనున్నారు.

లెదర్ పార్కుకు స్థల పరిశీలన

(5వ పేజీ తరువాయి)

వనరుల గురించి తహసీల్దారు పుల్లారావు, డీటీ కొండారెడ్డి, సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ తోట సిద్ధయ్య, వీఆర్వో కొండ కంపెనీ ప్రతినిధులకు వివరించారు.

2027లో ఉత్పత్తి ప్రారంభం..

ఆరు మిలియన్ డాలర్లతో(రూ.520 కోట్లు) స్థాపించి 2027లో ఉత్పత్తి ప్రారంభిస్తామని బ్రైస్లీ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2026 లెదర్ పార్కును ఏర్పాటు చెయ్యాలనే ఉద్దేశంతో ఉన్నామన్నారు. తొలుత తమిళనాడులో ఏర్పాటు చెయ్యాలని అనుకున్నామని, అయితే ఆంధ్రప్రదేశ్‌లో వనరులు అధికంగా ఉండడంతో ఇక్కడకు వచ్చామన్నారు. ఇక్కడ కంపెనీలో 2500 మంది ఉపాధి లభిస్తుందన్నారు. ఇండియా, బంగ్లాదేశ్ పారిశ్రామిక మేనేజర్ లెనిన్ మాట్లాడుతూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు లెదర్‌పార్కుపై ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారన్నారు. కంపెనీ ప్రతినిధులు సంతృప్తి మేరకు 100 శాతం వినుకొండకు లెదర్ పార్కు వస్తుందన్నారు. వీరి వెంట కంపెనీ గైడ్ గోపాలకృష్ణ, ఎమ్మెల్యే పీపీ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అమరావతి.. ఆహ్లాదం

(5వ పేజీ తరువాయి)

అటవీ పరిరక్షణ కోసం మూడు దశాబ్దాలుగా అలుపెరగకుండా పని చేస్తున్న కొమ్మిర అంకారావు లాంటివ్యక్తి జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. అంకారావు గురించి తెలుసుకుంటున్న కొద్దీ ఆసక్తికరంగా ఉందని చెప్పారు. ఆయనకులాగా తాను కూడా కోటి మొక్కలు నాటాక సగర్వంగా మాట్లాడతానని చెప్పారు. ఈ ఏడాది కోటి మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకుంటానన్నారు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణంపై అవగాహన కలిగిన గొప్ప వ్యక్తి చంద్రబాబునాయుడన్నారు. నీరు-చెట్టు వంటి పనులు చంద్రబాబు హయాంలో విజయవంతంగా జరిగాయన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగూరు నారాయణ, కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య, ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, పీసీసీఎఫ్ ఏకే.నాయక్, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ, రాజధాని గ్రామాల రైతులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహంలో అడ్మిషన్లు ప్రారంభం

బల్లికురవ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని వసతి గృహ సంక్షేమాధికారి నెహేమ్యా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, రెండేళ్ల నుంచి వసతి గృహంలో విద్యార్థులు ఉండే గదులు మరమ్మతులు చేయక పోవడంతో విద్యార్థులు లేక వసతిగృహం మూత పడిందన్నారు. ఈ ఏడాది విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో రూ. 50 లక్షల వరకు నిధులు మంజూరు చేయగా, వసతి గృహంలో గదులను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. వందమంది విద్యార్థులు ఉండేలా వసతి గదులను మర్మతులు చేసినట్లు తెలిపారు. 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు వసతి గృహంలో చేరాలని ఆసక్తి ఉంటే వెంటనే 9912261472 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

గోవాడ రోడ్డుకు ఆర్చ్ ఏర్పాటుకు సన్నాహాలు

ఎన్‌టీఆర్ మార్గంగా నామకరణం



సిద్ధం చేసిన ఆర్చి

అద్దంకి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడ రోడ్డుకు ఎన్‌టీఆర్ మార్గంగా నామకరణం చేశారు. ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసేందుకు ఆర్చ్ వివిధ కారణాలతో నిలిచిపోయింది. ఎట్టకేలకు ఏర్పాటుకు గోవాడ గ్రామ టీడీపీ ఆధ్వ ర్యంలో పనులు చేస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మాణం చేసిన తారు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయించారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. అదేసమయంలో ఆర్చ్ ఏర్పాటుకు కూడా మాజీ సర్పంచ్ పుట్టా దేవీ సాంబశివరావు ఆధ్వ ర్యంలో సిద్ధం చేస్తున్నారు. త్వరలో మంత్రి రవికుమార్ చేతుల మీదగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే నిత్యవసర సరుకులు

పర్చూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : 65 సంవత్సరాలు దాటిన వృద్ధులతోపాటు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటివద్దనే ప్రభుత్వ నిత్యవసర వస్తువులను అందజేస్తోందని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య తెలిపారు. బయోమెట్రిక్‌పడని వృద్ధులకు, దివ్యాంగులకు గురువారం రెవెన్యూ శాఖ సారధ్యంలో ఇంటింటికి తిరిగి నిత్యవసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పర్చూరు ముస్లిం వీధిలోని పలు కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాస రావు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



పంగులూరులో మొక్కనాటుతున్న మంత్రి రవికుమార్, బొబ్బేపల్లిలో మొక్కలు నాటుతున్న ఉపాధి కూలీలు

పంగులూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని చందలూరు గ్రామంలో గురువారం జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలునాటారు. సమాజంలో ప్రతివ్యక్తి మొక్కలు నాటిచెట్లను పెంచడం బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, విద్యుత్ ఈఈ మస్తానరావు, ఏఈ అనిల్‌కుమార్, స్థానిక నేతలు కేవీ. సుబ్బారావు, పెంట్యాల వెంకటేశ్వర్లు, మురకొండ సుబ్బారావు, కసుకర్తి సత్యం, రమేష్, ఏడుకొండలు, శేఖర్, జగన్, భానుప్రకాష్, రామాంజనేయులు, స్థానిక నేతలు పాల్గొన్నారు

బల్లికురవ : సమాజంలో పచ్చదనంతో పాటు పర్యావరణాన్ని ప్రతిఒక్కరూ కాపాడలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో బాలమ్మ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కొప్పెరపాడు, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాలలో డిప్యూటీ సీఈవో బాలమ్మ, ఎంపీడీవో కుసుమకుమారి మొక్కలను నాటారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు వాటిని పెంచే బాద్యత ప్రజలు తీసుకోవాలన్నారు. నేటి మొక్కలే భవిష్యత్‌లో నీడ నిచ్చే వృక్షాలు అవుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : విద్యార్థులు బాల్యం నుండే పర్యావరణ పరిరక్షణ పట్ల అభిరుచిని అలవర్చుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు సౌజన్యంతో కాకానిపాలెంలోని జీఎస్ఆర్ హ్యాండ్ రైటింగ్ అండ్ స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్ సెంటర్ నందు బాల బాలికలకు వక్తృత్వ పోటీలు, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికలకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. పాల్గొన్న విద్యార్థులకు మంచినీటి సీసాలు అందజేశారు. కార్యక్రమంలో చుండూరి మురళి సుధాకరరావు, అద్దంకి లేవి ప్రసాద్, జి. రమేష్, జ్యోతి రమేష్, మలాది వాసు, హరిబాబు, గోవాడ శ్రీకాంత్ దస్తగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చీరాల : నియోజకవర్గం పరిధిలో గురువారం ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఆర్‌పీఎం హైస్కూల్లో నిర్వహించిన మొక్కలు పంపిణీ కార్యక్రమంలో యువ నాయకులు గౌరీ అమర్నాథ్ పాల్గొన్నారు. కాలుష్య నియంత్రణపై మాట్లాడారు. అలాగే అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఈ రఘురామ్, మెప్మా సీఎంఎం కొండయ్య, ఏఎంసీ ఛైర్మన్ కొతవరపు జనార్ధనరావు, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టాలని నినదించారు. కార్యక్రమంలో ఏపీవో దాసు, గంజి పురుషోత్తం, జి.చంద్రమౌళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఐటీసీ ఆధ్వర్యంలో వాడరేవు సముద్రతీరంలో నిర్వహించిన పారిశుధ్య నిర్వహణ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొన్నారు. తోటవారి పాలెం గ్రామంలో నాదెండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమం జరిగింది. వేటపాలెం మండల పరిధిలోని దోగుపర్తి బాలకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

మార్టూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని పలుగ్రామాలలో మొక్కలను నాటారు.మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న రోడ్డు వద్ద ఉపాధి కూలీలతో గ్రామ టిడిపి నాయకులు తేలప్రోలు సాంబ శి వరావు పర్య వేక్షణలో మొక్కలను నాటారు.అదేవిదంగా కోలలపూడి గ్రామంలో సర్పంచ్ యం సతీష్ కుమార్ ఆద్వర్యంలో గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా,మరియు పొలాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉపాది కార్మికులతో కలిసి మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్,ఫీల్డు అసిస్టెంట్ గాలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇంకా యద్దనపూడి యంపిడివో కార్యాలయం వద్ద యంపిడివో మహమ్మద్ అఖీబ్ జావెద్ ఆద్వర్యంలో మొక్కలను నాటారు.


కోర్టు సముదాయంలో మొక్కనాటుతున్న న్యాయాధికారి అఖిల

అద్దంకి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.అఖిల అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కోర్టు భవనాల సముదాయం ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అఖిల మొక్కలు నాటారు. అనంతరం న్యాయవాదులు నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అఖిల మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. మొక్కల ద్వారా స్వచ్ఛమైన గాలి వస్తుంద న్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యడవల్లి శ్రీనివాసరావు, గృహలక్ష్మి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు. అద్దంకి పట్టణంలోని పలు వార్డులలో కమిషనర్ రవీంద్ర ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిమ్ వద్ద జిల్లా అధ్యక్షులు బంగారుబాబు మొక్కలు నాటారు. 15, 16 వార్డులలో కూటమి నేతల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. 19వ వార్డులోని గొట్టిపాటినగర్‌లో కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు మొక్కలు నాటారు.




విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు, చీరాలలో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్

ఇంజనీరింగ్ విద్యార్థినికి దాతల ఆర్థికసాయం


నగదును అందచేస్తున్న దాతలు

మార్టూరు, జూన్5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదవడానికి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న జాహ్నవి అనే విద్యార్థినికి గురువారం స్థానిక అమ్మ ఆశ్రమంలో పలువురు దాతలు రూ.66500 నగదును అందించారు. పర్చూరు గ్రామానికి చెందిన వెల్లంకి గోవిందాచారి, లలిత దంపతుల కుమార్తె జాహ్నవి గుంటూరులో ఇంజనీరింగ్ సీఈసీ ఫైనల్ ఇయర్ చదవాల్సి ఉండగా ఆర్థికసాయం కోసం వారు అమ్మ ఆశ్రమాన్ని సంప్రదించారు. దీంతో ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు పలువురు దాతలు సహకారంతో జాహ్నవికి సాయం అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రావుల బాపయ్య, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మచ్చా బాబు, పూసపాటి సాంబశివరావు, కొండముది రఘుబాబు, కొండిపర్తి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికులను బడిలో చేర్చండి



దుకాణాల్లో పరిశీలిస్తున్న అధికారులు

చీరాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : బాలలను కార్మికులుగా కాకుండా బడిలో చేర్పి బంగారు భవిష్యత్తు అందించాలని అసిస్టెంట్ లేబర్ అధికారి సాయిజ్యోతి అన్నారు. గురువారం పట్టణంలో చైల్డ్ డ్రైవ్ నిర్వహించారు. ఈక్రమంలో పలు దుకాణాలను పరిశీలించి ఆయా నిర్వాహకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అలాగే బాల కార్మికుడిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేశారు. షాడోస్ సంస్థ రాజా సాల్మన్, నాగరాజు, కిషోర్ తదతరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

హైదరాబాద్‌లోని మియాపూర్ వద్ద లారీని బస్సు ఢీకొట్టడంతో ఘటన

బల్లికురవ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన ముగ్గురికి గురువారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని మియాపూర్ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు ముక్తేశ్వరం గ్రామానికి చెందిన యలగాల శ్రీనివాస రావు అనే వ్యక్తి హైదరాబాద్‌లో నూతన గృహం నిర్మించుకొని గృహప్రవేశం చేపట్టారు. ఆయన ఇంట్లో జరిగే కార్యక్రమానికి ముక్తేశ్వరం గ్రామం నుంచి బుధవారం రాత్రి పది మంది వరకు ప్రైవేట్ బస్సులో బయలుదేరి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున ప్రైవేట్ బస్సు మియాపూర్ వద్దకు వెళ్లే సరికి రోడ్డుపక్కన ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ముక్తేశ్వరానికి చెందిన శివరాత్రి అనీల్, అంజమ్మ, యలగాల అంకమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. కాగా మరి కొందరికి సల్ప గాయాలయ్యాయి. బస్సులో ముందు వరుసలో ఉన్న ఇతర ప్రాంతానికి చెందిన ఇరువురు మృతి చెందారని గాయపడిన వారు తెలిపారు. ప్రమాద వార్త తెలియగానే ముక్తేశ్వరంలో ఉన్న వారి బంధువులు హైదరాబాద్‌కు తరలి వెళ్లారు.

కబ్జా కోరల్లో తీరం ?


విజయలక్ష్మీపురంలో అడ్డుకున్న స్థానికులు

చీరాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సముద్రతీరం కొంచెం కొంచెం కబ్జా కోరల్లోకి వెళుతోంది. ఇప్పటికే సీఆర్‌జెడ్ నిబంధనలు అతిక్రమించి రిసార్ట్స్ నిర్మించుకుని పెద్దఎత్తునే చాలా మంది బడాబాబులు దందా సాగిస్తున్నారు. తాజాగా మండల పరిధిలోని విజయలక్ష్మీపురంలో కొందరు వ్యక్తులు ఏకంగా తీరంకట్టలను ట్రాక్టర్లతో చదును చేస్తున్నారు. ఈక్రమంలో ఇప్పటికే చాలా వరకు చదునైంది. అయితే మత్స్యసంపద వేటతో జీవనం సాగిస్తున్న వారికి కట్టలు తెగితే భవిష్యత్తు ఉండదు. దీంతో బుధవారం సాయంత్రం సమయంలో గ్రామస్థులంతా ఏకమై ట్రాక్టర్లను అడ్డగించారు. అలాగే విషయానికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు పంపారు. అయితే గ్రామం చీరాల పరిధిలో ఉన్నా, చదును జరుగుతున్న ప్రాంతం బాపట్ల పరిధిలోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. విషయం ఇప్పటికే జిల్లాస్థాయి అధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. వాస్తవాలను పరిశీలించి అక్రమార్కులు ఆట కట్టించకుంటే సముద్ర ఉధృతికి గ్రామాలే ఏకంగా కొట్టుకు పోయే ప్రమాదం లేకపోలేదు.

అదుపు తప్పి సర్వీస్ రోడ్డులోకి తిరగబడ్డ లారీ


రోడ్డుపై తిరగబడ్డ లారీ

పంగులూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్ ప్రారంభంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న మామిడికాయల లోడు లారీ సర్వీస్ రోడ్డులోకి తిరగబడింది. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెలితే ఒంగోలు నుంచి మామిడికాయల లోడుతో విజయవాడ వెళుతున్న మినీ లారీ ముప్పవరం ఫ్లై ఓవర్ పైకి చేరుకనే ప్రయత్నంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని సర్వీస్ రోడ్డులోకి తిరగబడింది. ఈ ఘటనలో లారీ నడుపుతున్న డ్రైవర్ తాజుద్దీన్ ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది స్థానిక పోలీసుల సాయంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.



అనుకున్నదే జరిగింది!

'ఇరిగేషన్'లో రచ్చకెక్కిన ఎల్‌వోసీ యవ్వారం

అనుకున్నదే జరిగింది. ఇరిగేషన్ శాఖలో తలెత్తిన ఎల్‌వోసీ (బడ్జెట్ కేటాయింపు) వివాదం రచ్చకెక్కింది. ఇప్పటివరకూ అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య జరిగిన యవ్వారం ఇప్పుడు హైకోర్టు మెట్లు ఎక్కింది. కాజీవే కాంట్రాక్టర్‌కు మొత్తం ఎల్‌వోసీని కేటాయిస్తూ చీఫ్ ఇంజనీర్ ఉత్తర్వులను మార్చగా, దీనిపై అవతలి కాంట్రాక్టర్ కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ కేసు తేలే వరకూ ఎవరికీ బిల్లు విడుదలయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం బిల్లులు మంజూరుకు ఎల్‌వోసీ ఇచ్చినా దానిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం సక్రమంగా జరగలేదు.

8



కొవిడ్ కలకలం

ఆరుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ ● ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో వెలుగులోకి.. ● అందరూ ఐసోలేషన్‌లోనే..



నెల్లూరు (వైద్యం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మహమ్మారి కొవిడ్ కలకలం రేపింది. జిల్లాలో ఒకేసారి ఆరుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యవర్గాలను కలవరపాటుకు గురిచేసింది. బాధితుల్లో ఒకరిది తిరుపతి జిల్లాకు చెందిన గూడూరు. మిగిలిన ఐదుగురు జిల్లావాసులే. నెల్లూరు నగరంలోని ఇద్దరు నర్సింగ్ విద్యార్థులు కొవిడ్ బారిన పడ్డారు. వీరిలో ఓ విద్యార్థిని రెండు రోజుల క్రితం కేరళ నుంచి నెల్లూరుకు వచ్చింది. అలాగే భక్తవత్సలనగర్‌కు చెందిన 60 ఏళ్ల వ్యక్తికి కూడా కరోనా సోకినట్లు అధికారులు గుర్తించారు. వెంకటాచలం మండలం అనికేపల్లికి చెందిన ఓ యువకుడు, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన మరో యువకుడూ కరోనా బారిన పడినట్లు అధికారులు గుర్తించారు. కరోనా అనుమానంతో ఈ ఆరుగురు వైద్యాధికారులను కలవగా రెండు రోజుల క్రితం కరోనా ర్యాపిడ్ పరీక్ష చేశారు. ఇందులో నిర్ధారణ అయింది. దీంతో అధికారులు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా కరోనా పాజిటివ్‌గా తేలింది. ముందుగా వీరు కరోనా లక్షణాలు, జలుబు, జ్వరం, కీళ్ల నొప్పులు వంటి వాటితో వైద్యాధికారులను సంప్రదించటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే, బాధితులంతా హోం ఐసోలేషన్‌లో ఉండి వైద్య సేవలు పొందుతున్నారు.

● జీజీహెచ్‌లో 30 పడకలు

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇప్పటికే 30 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. కరోనా కేసులు ఎక్కువ సీరియస్ అయితే జీజీహెచ్‌లో వైద్యచికిత్సలు అందిస్తారు. అయితే ప్రస్తుతం నమోదయిన కేసులు ప్రాథమిక స్థాయిలోనే ఉండటంతో బాధితులను హోం ఐసోలేషన్‌లోనే ఉంచి చికిత్సలు అందిస్తున్నారు.

ప్రాథమిక దశలోనే..

జిల్లాలో ఆరుగురికి కరోనా పరీక్షలు చేయగా అందరికీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరంతా హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. కరోనా తీవ్రత మాత్రం లేదు. ప్రాథమిక దశలోనే నిర్ధారణ అయింది.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

జాగ్రత్తలు తీసుకోవాలి

కరోనా బాధితులతో అనుబంధంగా ఉన్న వారందరికీ పరీక్షలు చేశాము. చుట్టు పక్కల వారు జాగ్రత్తలు తీసుకోవాలి. మాస్కులు, శానిటైజర్లు. ప్రస్తుత బాధితులకు వచ్చిన కరోనా తక్కువ స్థాయిలో ఉండటంతో ఎలాంటి ప్రమాదం లేదు.

- డాక్టర్ భాస్కర్, ఎపిడమాలజిస్ట్

విజయోస్తు!

- నేటినుంచే 'డీ'ఎస్సీ పరీక్షలు
- 8 కేంద్రాలు.. 31,221 మంది అభ్యర్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు.. పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

నిరుద్యోగ యువత ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ- 2025 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి 30వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 31,221 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిర్ణీత సమయానికి గంట ముందు గానే కేంద్రాలకు చేరుకోవాలని ఆ తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు హెచ్చరించారు. ఇక పరీక్షల నిర్వహణలో త్రీమెన్ కమిటీ సభ్యులతోపాటు ఇతర అధికారులు, సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు అందచేస్తారు.

నెల్లూరు(విద్య), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎస్‌జీటీ కలిపి 668 పోస్టులు, ట్రైబల్ వెల్ఫేర్ విభాగంలో 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు 31,221 మంది పోటీ పడుతున్నారు. నెల్లూరులో 2, కోవూరు 1, కావలిలో 2, గూడూరులో 1, విద్యానగర్‌లో 2 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు వైద్యశిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరాకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

● స్క్రైబ్‌ల ఏర్పాటు

దివ్యాంగుల కోసం ఇంటర్ అర్హత కలిగిన వారిని సహాయకులుగా వినియోగించుకోనున్నారు. వీటికి సంబంధించిన ఇతర విషయాలను అభ్యర్థులకు కేంద్రంలో అధికారులు తెలియచేస్తారు. అంధత్వం కలిగిన అభ్యర్థులు స్క్రైబ్‌లను వినియోగించుకునే వారికి 50 నిమిషాలు అదనంగా సమయం కేటాయిస్తున్నారు. ఆర్థో హ్యాండీక్యాప్డ్ వారికి ఎటువంటి అదనపు సమయం వర్తించదు. కేంద్రాల్లో పీహెచ్‌సీ జెన్యూనిటీ పరిశీలించి మెడికల్ బోర్డు(డీఎంహెచ్‌ఓ) జారీ చేసిన సర్టిఫికెట్లు ఉన్నవారికే స్క్రైబ్‌లను కేటాయించనున్నారు. హాల్‌టికెట్లలో నమోదైన తప్పులపై అభ్యర్థులు ఆందోళన చెందవద్దని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ ధ్రువీకరించిన నకలు కాపీని అందచేసి కేంద్రం వద్దే సరిచేసుకునే ఏర్పాట్లను చేశారు.

ఏమైనా సమస్యలుంటే..
6281704160, 8121947387, 8125046997, 9398810958, 7995649286, 7995789286, 9963069286, 7013837359 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు





ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : డీఎస్సీ పరీక్షలకు ఆర్టీసీ అధికారులు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులను ఏర్పాటు చేసింది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల మేనేజర్లతోపాటు ఉన్నతాధికారులకు రాష్ట్ర అధికారులు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో డిపో మేనేజర్లు పరీక్ష కేంద్రాల వైపు వెళ్లే బస్సుల డ్రైవర్లు, కండక్టర్లకు పలు సూచనలు అందించారు.

కట్టుదిట్టంగా నిర్వహణ

డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము. సమయం దాటిన తరువాత కేంద్రంలోకి అనుమతించరు. అలాగే ఎలక్ట్రానిక్ పరికరాలకు కూడా అనుమతిలేదు, లోపలకు తెచ్చిన అభ్యర్థులపై చర్యలు తీసుకుంటాము. పీహెచ్‌సీ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసిన అభ్యర్థులు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారుల కౌంటర్ సంతకాలతో విధిగా పరీక్షకు హాజరు కావాలి. అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశాము.

- బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

పక్కా ఏర్పాట్లు : ఇన్చార్జి కలెక్టర్



డీఎస్సీ-2025 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు ఇన్చార్జి కలెక్టర్ కార్తీక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై అధికారులతో ఆయన సమీక్షించారు. కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు జరుగుతున్నందున ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరాలే ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని, గంట ముందుగానే కేంద్రం వద్దకు చేరుకునేలా సన్నద్ధం కావాలన్నారు. అలాగే వైద్య సదుపాయాలు, మంచినీటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ఈ సమీక్షలో డీఆర్‌ఓ ఉదయ్‌భాస్కర్, డీఈఓ బాలాజీరావు, డీఎంహెచ్‌ఓ సుజాత, నెల్లూరు, కావలి ఆర్డీఓలు వంశీకృష్ణ, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ జవాబుపత్రాల ట్యాంపరింగ్‌పై విచారణ

- వివరాలు 8లో..



సింహ వాహనంపై చాముండేశ్వరి దేవి

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో శ్రీ చాముండేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి అమ్మవారు సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



రోడ్డుపక్కన షేక్ అజీమా మృతదేహం

ఆటోను ఢీకొన్న కారు

- ఇద్దరి మృతి.. 9 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషయం
- ఆత్మకూరు సమీపంలో ఘటన

వారంతా రెక్కాడితేగానీ డొక్కా డని మహిళా కూలీలు. పొరుగూ రులో పనుల కోసం ఉదయాన్నే అంతా ఆటోలో బయలుదేరారు. కాసేపట్లో గమ్యం చేరతామన్న సమయంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను వేగంతో దూసుకొచ్చిన ఓ కారు ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్‌తోపాటు ఓ మహిళ మృతి చెందగా, తొమ్మిది మంది మహిళలకు గాయాలయ్యా యి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఆత్మకూరు సమీపంలోని ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఉదయం జరిగిన ఈ ఘటన కూలీల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.

8

విద్యా శాఖలో భారీగా బదిలీలు

నెల్లూరు (విద్య), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సిబ్బందికి స్థానచలనం కలిగింది. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా నాన్‌టీచింగ్ సిబ్బంది 42 మంది వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి.పద్మకుమారిని ప్రకాశం జిల్లా ఒంగోలు విద్యా శాఖ కార్యాలయానికి, అక్కడున్న వి.విజయ్‌కుమార్‌ను నెల్లూరుకు బదిలీ అయ్యారు. అలాగే ఏపీ ఓపెన్‌స్కూల్ జిల్లా కోఆర్డినేటర్, జిల్లా పరీక్షల విభాగం ఏడీగా పని చేస్తున్న ఎస్‌కె.అసదుల్లాఖాన్‌ను కర్నూలు జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఏడీగా బదిలీ చేశారు. వీరితో పాటు ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, 17 మంది జూనియర్ అసిస్టెంట్లు, 12 మంది రికార్డ్ అసిస్టెంట్లు, ఐదుగురు ఆఫీస్ సబార్డినేట్లు, ఒక గార్డినర్, ఒక వాచ్‌మన్ వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

మొక్క స్నేహితుడితో సమానం

వనమహోత్సవంలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎంపీ వీపీఆర్

నెల్లూరురూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :ఒక మొక్క మంచి స్నేహితుడితో సమానమని, ప్రతి ఒక్కరు విధిగా తమకు అనుకూలమైన ప్రాంతాలలో మొక్కనాటి సంరక్షించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరురూరల్ మండలం దొంతాలి వద్ద నున్న నగరవనంలో గురువారం వనమహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వారు మొక్కలునాటి నీరు పోశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలు నాటడంతోపాటు చెట్లను నరకకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మంచినీరు నుంచి పీల్చే గాలి వరకు అన్నీ కాలుష్యం అయిపోయిన ఈ దుస్థితిలో మొక్కలు పెంచడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు రెడ్యూస్, రీయూస్, రీసైకిల్, రీప్లేస్ అనే నినాదాలను పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో మహ్మద్‌బాషా, ఆర్డీవో అనూషా, కమిషనర్ నందన్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



నాటిన మొక్కకు నీళ్లు పోస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఫోటోలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఇతర అధికారులు



ఈ గబ్బు.. ఇంకెన్నాళ్లు!

పత్రికలు ఘోషిస్తున్నా.. పర్యావరణం దెబ్బతింటున్నా కోళ్ల వ్యర్థాల రవాణా మాత్రం ఆగడం లేదు. ప్రతిరోజూ లోడ్ల కొద్దీ వ్యర్థాలు చేపల చెరువుల్లోకి డంప్ అవుతున్నాయి. ఏదో మొక్కుబడిగా కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలు పట్టుకుంటున్నట్లు పోలీసులు చెబుతున్నా తెర వెనుక భారీస్థాయిలోనే ఈ తతంగం జరుగుతోంది. మరోవైపు చికెన్ వ్యర్థాలయితే ఖర్చు తక్కువ, తక్కువ కాలంలోనే చేప కౌంట్ వస్తుంది. దీంతో పెంపకందారులు సంప్రదాయ మేతను పక్కన పెట్టి ఆ వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ప్రధానంగా విదేశాలకు ఎగుమతి అయ్యే ఫంగస్, రూప్ చంద్ రకం చేపల పెంపకందారులు చికెన్ వ్యర్థాలను వినియోగిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన మత్స్య శాఖ సిబ్బంది కొరత పేరుతో చేతులెత్తేయగా, రెవెన్యూ, పంచాయతీ శాఖలు అటువైపు కన్నెత్తి చూడటం మానేశాయి.

- పూర్తి వివరాలు 8లో..

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు బిట్-2 రేషన్ డీలర్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు తహసీల్దారు కృష్ణప్రసాద్ తెలిపారు. విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు, ఏఓ బి.వెంకటరెడ్డి తమ సిబ్బందితో కలిసి కోడూరు బిట్-2 గ్రామంలోని చౌకదుకాణంలో తనిఖీలు చేశారు. అవకతవకలకు పాల్పడటంతో షాప్ నెం.0928014 డీలర్‌పై 6-ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దారు తెలిపారు.

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకోండి

నెల్లూరు (క్రైం) : కుటుంబసభ్యులతో కలిసి ముస్లింలు బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య సూచించారు. శనివారం బక్రీద్ సందర్భంగా గురువారం రాత్రి ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరించినా, రెచ్చగొట్టే ప్రసంగాలు, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర డీఎస్పీ పి సింధుప్రియ, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సీడీపీవో కార్యాలయంలో ఇండక్షన్ స్టౌలు

అంగన్వాడీలకు ఇండక్షన్ స్టౌలు, కుక్కర్లు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన భావిభారత సమాజాన్ని నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తోంది. ఇప్పటికే అనేక వస్తులు కల్పించగా, తాజాగా అంగన్వాడీల్లో వంటకాల కోసం ఇండక్షన్ స్టౌలు (విద్యుత్), కుక్కర్లు, పాన్‌లను సరఫరా చేస్తోంది. ఇప్పటికే ఈ సామగ్రి సీడీపీవో కార్యాలయాలకు చేరగా, ఎంపీ, ఎమ్మెల్యేల ద్వారా వాటిని పంపిణీ చేయించడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు సత్వరమే భోజనాలు తయారు చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడనున్నాయి. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఒత్తిడి లేని విద్యను అంగన్‌వాడీల్లో బోధిస్తారు. గర్భిణులలో రక్తహీనత తదితర ఆరోగ్య సమస్యల నివారణకు ప్రతి నెలా సరుకులు ఇస్తున్నారు. బాలింతలకు కూడా అదే తరహాలో ఆహార కిట్లు అందచేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 530

యోగాతో ఆరోగ్యం : ఎంపీడీఓ

లింగసముద్రం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు అన్నారు. గురువారం లింగసముద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో లింగసముద్రం-1, పెంట్రాల, మొగిలిచెర్ల సచివాలయ సిబ్బందికి ఆయన యోగాసనాల పోటీలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలని సూచించారు.



ఎంపీడీఓ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది



కావలిటౌన్: మొక్క నాటి నీరు పోస్తున్న ఆర్డీవో వంశీకృష్ణ, మున్సిపల్, అటవీశాఖ అధికారులు, టీడీపీ నేతలు



అల్లూరు : మొక్కలు నాటుతున్న తహసీల్దారు లక్ష్మీ నారాయణ



వలేటివారిపాలెం: చుండి మోడల్‌స్కూల్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఎమ్మెల్యే ఇంటూరి

● ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

కందుకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్క లు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. పామూరు రోడ్డు సర్కిల్‌లో నిర్వహించిన పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ తదితరులు రోడ్డు మార్జిన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం వర్షపునీటి నిల్వ, ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, అటవీశాఖ అధికారులు, మెప్మా సిబ్బంది, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, గుర్రం మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, ముచ్చు శ్రీను, చిలకపాటి మధు, ఉన్నం వీరాస్వామి, అత్తోట మధుబాబు, పెంట్రాల సుబ్బారావు, గుర్రం మలికార్జున, అత్తంటి శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పామూరురోడ్డు సర్కిల్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టరు తదితరులు

సబ్ కోర్టు ఆవరణలో

పట్టణంలోని సబ్ కోర్టు ఆవరణలో అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎన్ నిఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి శ్రీధర్‌నాయుడు, వైస్ ప్రెసిడెంట్ ఎస్ పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మురళీధర్, సీనియర్ న్యాయవాదులు ఎం మహేశ్వరరావు, టి తిరుమలరావు, ఎల్. బ్రహ్మయ్య, ఎస్కే మస్తాన్‌వలి, బి. రోశయ్య, షేక్ షంషుద్దీన్, జమీర్‌బాషా, సుల్తాన్‌బాషా, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

●కావలిటౌన్ (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వాడవాడలా మొక్కలు నాటి వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ పార్కు వద్ద మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణ మొక్కలు నాటారు. ఈసందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, అమరా వేదగిరి ,కిరణ్, కోటయ్య ఖమర్‌బాబు, ఇబ్రహీం, మంచాల ప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో

బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు మందా కిరణ్ అధ్యక్షతన నేతలు జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేతలు కందుకూరి సత్యనారాయణ, జీ భరత్‌కుమార్, పరుసు వెంకటేశ్వర్లు, సీవీసీ సత్యం, వాయుగండ్ల సుధీర్ తతదితరులు పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో

ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ప్రాంగణంలో 200 మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాస్, సుశీల, పీడీ మణికంఠ, కార్పొరేషన్ తరఫున డివిజనల్ మేనేజర్ పిచ్చయ్య, ప్లాంటేషన్ మేనేజర్లు నీరజ, జానకి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ప్రాంగణంలో

డీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో డిపో ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయనతో పాటు అధికారులు ఖాదర్‌మోహిద్దీన్, రత్నం, రవిప్రకాష్, జనార్ధనరావు, కార్మిక సంఘాల నేతలు కలాం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశ్రాంత ఉపాధ్యాయిని మొగిలిశెట్టి జమున ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంతో నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. తన నాట్యాలయ శిష్య బృందంచే పర్యావరణానికి సంబంధించిన వివిధ రకాల పండ్ల మొక్కలను చిత్రీకరించి జనతాపేట కూడలిలో వాటిని ప్రదర్శించి ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమాచంద్, విశ్వోదయా బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని మాధవి తదితరులు పాల్గొన్నారు.

● **కలిగిరి :** పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా నీటి యాజమాన్య సంస్థ జిల్లా పథ సంచాలకులు గంగాభవాని పెద్దకొండూరు, సిద్దన కొండూరు గ్రామాల్లో ఉపాధి సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, నిశ్శంకర సురేష్, బీజేపీ నాయకులు నందనవనం ప్రభాకరరావు, ఎంపీడీఓ కార్య లయ సిబ్బంది దీక్షితులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

● **అల్లూరు :** పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో నగర పంచాయతీ అధికారులు పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల తహసీల్దారు లక్ష్మీ నారాయణ, డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్ కుమార్, సచివాలయం-1 కార్యదర్శి వరప్రసాద్, ఆర్ఐ ప్రభు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎంపీడీఓ

అల్లూరులోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో, సిపీడబ్ల్యూఎస్ ప్రాజెక్టు ఆవరణతోపాటు పలు సచివాలయాల ప్రాంగణాల్లో ఎంపీడీఓ రజనీకాంత్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పురుషోత్తం పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో

అమ్మ పేరుతో ఓ మొక్కను నాటుదామనే దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని ఆ పార్టీ మండల కన్వీనర్ చెంతాటి కృష్ణ మోహన్ అన్నారు. అల్లూరు రామకృష్ణ కళాశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో మల్లికార్జున సింగ్, చాగంటి చెంగారెడ్డి, చెంతాటి నరేష్, ముప్పా సాయి, కృష్ణారెడ్డి, దండా సుమంత్ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **జలదంకి:** స్థానిక పిఎసిఎస్ బ్యాంకు ఆవరణలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి కావలి డిఎల్‌సిఓ కె తిరుపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బ్యాంకు ఆవరణలో పలురకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు నాగగాయత్రి, పిఐసి మస్తానమ్మ, ఆడిటర్ రమేష్, సొసైటీ సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

●**వలేటివారిపాలెం :** నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని వలేటివారిపాలెం, చుండి, పోకూరు, కాకర్లవారిపాలెం తదితర గ్రామాల్లోని గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రహదారుల వెంబడి అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రదేవ్, చుండి మోడల్‌స్కూల్ పిన్స్‌పాల్ వెంకటేశ్వర్, ఈఓఆర్డీ రమేష్‌బాబు, ఏపిఓ దయాసాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులను అరికట్టాలి



కావలి డీఎస్పీని కలిసిన దళిత సంఘర్షణ సమితి నేతలు

కావలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ ఫైనాన్స్ వేధింపులకు గురై అనేకమంది పేదలు ప్రాణాలను కోల్పోవాల్సి వస్తోందని వారి దుర్మార్గాలను అరికట్టాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి గురువారం కావలి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఆయన మాట్లాడుతూ కావలి డివిజన్‌లో ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీలు, తండల వ్యాపారస్తులు, కాల్ మనీ చేసే వారి దుశ్చర్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కలిగిరి మండలంలో కల్లుగీత కార్మికుడు రత్తయ్య ఆత్మహత్యకు కూడా ప్రయివేట్ ఫైనాన్స్ వేధింపులు కారణమన్నారు. వీరి వేధింపులకు దగదర్తి మండలంలో కూడా ఒకరు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు జెడ్డా వాసు, జరుగుమల్లి విజయరత్నం, జ్వాలా తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



శామీరపాలెంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ దయాసాగర్

వలేటివారిపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి శ్రామికులకు కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని ఏపీఓ దయాసాగర్ తెలిపారు. మండలంలోని శామీరపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఏపీఓ దయాసాగర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వద్ద ఉపాధి శ్రామికులకు తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



కుందుడు గుమ్మ ఆటలో పాల్గొన్న చిన్నారులు

ఉలవపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో 35 రోజుల పాటు పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులు ముగిసినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు గురువారం తెలిపారు. చిన్నారులకు పుస్తక పఠనంతో పాటు ఆటపాటలు నిర్వహించినట్లు తెలిపారు. క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశా మన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు రోడ్డు ఫీడర్‌లో 11కేవీ లైనుకు అడ్డంగా ఉన్న చెట్లు తొలగించేందుకు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 10.30 గంటల వరకు ఆ ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని టౌన్ ఎఈ టీవీ నరసింహాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని గణేష్ నగర్, కేసరిగుంట కాలనీ, గాయత్రీ నగర్, ఎమ్మెల్యే ఆఫీసు, డీవీ నగర్, ప్రశాంతి నగర్, కొత్తకుమ్మరిపాలెం, సింహాద్రి నగర్, ఎర్రవడ్డిపాలెం, వెంకటేశ్వర నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. అలాగే ఓగూరు సబ్‌స్టేషన్ నుంచి పలుకూరు ఫీడర్‌కు వెళ్లే లైనులో కూడా చెట్ల తొలగింపు ఉన్నందున పలుకూరు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు.



పెండింగ్ పనుల పూర్తికి చర్యలు

● **హజరత్తయ్య, ఇరిగేషన్ డీఈ**

కందుకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకోనున్నట్లు కందుకూరు ఇరిగేషన్ డీఈ హజరత్తయ్య తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను పూర్తిచేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు ఆయన తెలిపారు.

? సబ్ డివిజన్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఇప్పటికైనా దృష్టిసారిస్తారా.

! ఇరిగేషన్ డిపార్టుమెంటులో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయించాలన్న లక్ష్యంతో ఉన్నాం. ఆదిశగా ప్రణాళికలు కూడా సిద్ధం చేశాం.

? రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మోపాడు సప్లైఛానల్ పరిస్థితి ఏమిటి.

! గత 22 సంవత్సరాలుగా మోపాడు సప్లైఛానల్ పనులు కొనసాగుతున్న విషయం వాస్తవం. మరో 3 కోట్ల రూపాయల మేర పనులు పెండింగ్ ఉన్నాయి. త్వరలోనే పనులు ప్రారంభించి, ఈ ఏడాది పూర్తిచేయిస్తాం.

? మిగిలిన అసంపూర్తి పనుల పరిస్థితి ఏమిటి.

! పోకూరు చెరువు మరమ్మతులను త్వరలోనే ప్రారంభించి పూర్తిచేయిస్తాం. అలాగే ఎల్‌యూ సప్లై ఛానల్ పరిధిలో బద్దిపూడి చెరువు, కాలువ మరమ్మతులు పెండింగ్ ఉన్నాయి. వాటిని కూడా త్వరితగతిన ప్రారంభించటానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రభుత్వ పాఠశాలలో వంట గది ప్రారంభం



నూతనంగా నిర్మించిన వంటగదిని ప్రారంభిస్తున్న ఎంఈఓ నాగేశ్వరరావు

జలదంకి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు విజయవాడలో స్థిరపడ్డ లింగరాజు అగ్రహారానికి చెందిన కంచర్ల కొండపనాయుడు రూ.4లక్షలతో తన తల్లి దండ్రులు కంచర్ల వెంకయ్య, రావమ్మల జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలలో వంట గదిని నిర్మించారు. నూతనంగా నిర్మించిన వంటగదిని గురువారం ఎంఈఓ సిహెచ్ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వంటగది నిర్మాణ దాత కంచర్ల కొండపనాయుడు దంపతులు, ఎండిఓ ఎస్ మహేశ్వరి, సర్పంచ్ మంగళి తిరుమల, ట్రస్ట్ సభ్యులు గాలి శ్రీనివాసులు, గ్రామస్థులు కంచర్ల మాల్యాద్రినాయుడు, కొండపనాయుడు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

కావలి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వైకుంఠపురం 1వ లైన్‌లో ఓ పిచ్చికుక్క కనిపించిన వారిని కరుస్తుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. బుధ, గురువారాలలో సుమారు 10 మందిని కరవడంతో బెంబేలెత్తు తున్నారు. ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక జనతాపేట నార్తులో రాత్రి పూట వీధి కుక్కలు వాహనాలను వెంబడిస్తున్నాయని, మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి కాపాడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

అవినీతి అక్రమాలపై బహిరంగ చర్చ ఏమైంది?

కావలిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని పదే పదే ప్రగల్భాలు పగిలిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఎందుకు బహిరంగ చర్చకు సిద్ధం కావడం లేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం ముసునూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూఅమృత్ పథకంలో తాను కాంట్రాక్టర్ నుంచి 13 కోట్ల రూపాయలు కమీషన్ తీసుకున్నట్లు ఎమ్మెల్యే చేసిన ఆరోపణల్లో పస లేదన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన వైసీపీ నేతలు

కావలి, జూన్ 5 (ఆంధ్ర జ్యోతి): దగదర్తి మండల వైసీపీ నాయకులైన జలదంకి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు, జడ్పీటీసీ తాళ్ళూరు స్వరూపరాణి, కొంత మంది ఎంపిటీసీలు ముఖ్యమంత్రి నా రా చంద్రబాబునాయుడిని, జి ల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూ క్‌ను బుధవారం రాత్రి తాడేపల్లి లోని సచివాలయంలో కలి సారు. కావలి ఎమ్మెల్యే దగు మాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో వారు టీడీపీలో చేరడంలో భాగంగానే వారిని కలిసినట్లు రాజకీయ పరిశీలకులు వెల్లడిస్తున్నారు.



కావలి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన దగదర్తి వైసీపీ నేతలు

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన

ఉలవపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం, రాజుపాలెం గ్రామాల్లో కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాదుబాబు అధ్యక్షతన గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మామిడి, సపోటా, మిరప, వరి ప్రధాన సాగు చేస్తున్నందున వాటి సస్యరక్షణ చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం మామిడి పంట కోత దశలో ఉన్నందున రైతులు పండు ఈగ బెడద నుంచి కాపాడుకునేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. కందుకూరు నిర్మా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం అనురాధ మాట్లాడుతూ డ్రోన్ దీదీ అనే కేంద్ర ప్రభుత్వ పథకం కింద స్వయం సహాయక సంఘం మహిళలు 80 శాతం సబ్సిడీతో డ్రోన్ తీసుకొని అద్దెకు పిచికారి చేసుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందొచ్చన్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై తయారుచేసిన పుస్తకాలను రైతులకు అందించారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆత్మా బీటియం కృష్ణ, రైతు సేవా కేంద్రం ఉద్యాన సహాయకులు యోగేష్, వెంకట్రావు, సుచరిత, రైతులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న నిర్మా పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనురాధ

ఆయుష్షును పెంచే ఆయుధం యోగా

అల్లూరు, జూన్ 5 (ఆంధ్ర జ్యోతి): యోగా అనేది మానవుని ఆయుష్షును పెంచే ఆయుధమని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అల్లూరు రామకృష్ణ డిగ్రీ కళాశాలలో గురువారం యోగాంధ్రపై అవగాహన కల్పించడంతోపాటు ఆసనాలను వేశారు. ఈ సందర్భంగా యోగా గురువు మల్లికార్జున విద్యార్థులతో ఆసనాలను వేయించి విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కొప్పు శ్రీనివాసులు, శిక్షకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న అధికారులు, విద్యార్థులు

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వలేటివారిపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి 7,8,9, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. ఎంపీసీ, బైపీసీ, సీఇసి కోర్సులకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓసీ, బీసీలకు రూ. 200, ఎస్సీ, ఎస్టీలకు రూ. 150 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో ఈనెల 6వ తేదీ నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

●**ఉలవపాడు :** మండలంలోని వీరేపల్లి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులకు విద్యాశాఖ కమిషన్ మరో అవకాశం కల్పించిందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 20 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు. అదేవిధంగా 7,8,9 తర గతుల్లో ఈ విద్యాసంవత్సరం ఏర్పడిన ఖాళీల భర్తీకి కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

● **కందుకూరు :** మండలంలోని జీ. మేకపాడులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేసినందున విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ యు దాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంతో పాటు 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

● **కొండాపురం :** ఆదర్శ పాఠశాలల్లో 6 నుండి 9వ తరగతితోపాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మిగిలిపోయిన సీట్ల భర్తీకి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ షేక్ ఖాదర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈనెల 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు ఈనెల 24వ తేదీన పాఠశాల స్థాయిలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించకోవాలని ఈసందర్భంగా ఆయన కోరారు.

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు..

కావలి, జూన్ 5 (ఆంధ్ర జ్యోతి): కావలి పట్టణ నడి బొడ్డున ఆర్వోబీ పక్కన ఉన్న ప్రధాన చర్చి రోడ్డుకు మోక్షమెప్పుడని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ట్రంకు రోడ్డు నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో పట్టణంలోకి వెళ్లే ప్రధాన పైపు లైన్‌ను ఆ రోడ్డు కింద వేశారు. దీంతో ఆపైపులైన్ తరచూ దెబ్బ తింటుండటంతో రోడ్డును పగుల కొటట్టం పరిపాటైంది. 12 రోజుల వ్యవధిలో ఇటీవల రెండు పర్యాయాలు పైపులైన్ పగలటంతో రోడ్డును తవ్వి పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. గుంట పూడ్చకుండా వదిలి వేయటంతో దానిలో పక్కనే ఉన్న మురుగు కాలువ నీరు చేరింది. గతంలో నాసిరకం పైపులు వేయటంతో తరచూ పగిలిపోతున్నందున మరమ్మతులు చేయడం మానేశారు. నాసిరకం పైపులైన్ తొలగించి దాని స్థానంలో ఐరన్ పైపులైన్ వేసే వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు అవకాశాలు లేవని అధికారులు చెపుతున్నారు. ప్రధానంగా ఐడీఎస్ఎంటీ ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి ట్రంకు రోడ్డులోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు ఉన్న ప్రధాన పైపులైన్ దెబ్బతింది. దానిని తొలగించి దాని స్థానంలో ఐరన్ పైపులైన్ వేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నారే కాని నిధులు మంజూరై అది ఆచరణకు నోచుకోలేదు.



మురుగునీటి మయంగా ఉన్న రోడ్డు

మురుగు నీటి పారుదలకు ఆటంకం

అలాగే పైపులైన్ పక్కనే ఉన్న ప్రధాన డ్రైనేజీ కూడా తరచూ మురుగు నీటి పారుదలకు ఆటంకం కలుగుతోంది. అయితే పైపులైన్ సమస్య శాశ్వతంగా పరిష్కారమైతే కాని ఆ డ్రైన్ నిర్మాణం చేట్టలేమని అధికారులు చెపుతున్నారు. ప్రధాన పైపులైన్ దెబ్బతిని ఉండటంతో దాని వలన తాగునీటి ఇబ్బందులతో పాటు ఆ మార్గంలో రాకపోకలకు ఆటంకం కలగటమే కాక డ్రైనేజీ సమస్య కూడా ఉత్పన్నమవుతోంది. ఒక్క పైపులైన్‌తో ఇన్ని సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నా అధికారులు స్పందించటంలేదని, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చొరవ తీసుకుని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ గబ్బు.. ఇంకెన్నాళ్లు!

- ఆగని చికెన్ వ్యర్థాల తరలింపు
- చేపలకు ఆహారంగా వేస్తున్న అక్రమార్కులు
- ఇవి తింటే ప్రజల ఆరోగ్యానికి ముప్పే
- చెరువులు, పరిసరాలూ కలుషితం
- మామూళ్ల మత్తులో అధికారులు.. పోలీసులదీ అదే తీరు

ఆంధ్రజ్యోతి పరిశీలన

సంగం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సంగం, చేజర్ల, బుచ్చిరెడ్డిపాలెం, టీపీగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు తదితర సముద్ర తీర మండలాల్లో సుమారు వేల ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. చేపల చెరువులు సాగు చేస్తున్న కొందరు చేపలకు మేత ఖర్చు తక్కువని సంప్రదాయ మేతకు బదులుగా కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తున్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, కడప, రాయలసీమ జిల్లాల్లో చికెన్ దుకాణాల్లో వృథాగా పడవేసే కోళ్ల వ్యర్థాలను సేకరించి డ్రమ్ముల్లో వేసుకుని వాహనాల్లో చేపల చెరువులకు తరలిస్తున్నారు. అక్కడ ఒక డ్రమ్ము చికెన్ వ్యర్థాలు రూ.500లకు కొని చేపల సాగు రైతులకు రూ.1600 నుంచి 1800లకు మూడంతల ఆదాయానికి విక్రయిస్తున్నారు. ఒక్కో లారీలో 60 నుంచి 80 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలు తీసుకువస్తే సుమారు రూ.50 వేలకుపైగా ఆదాయం వస్తుంది. ఈ లెక్కన నెలకు సుమారు రూ.15 లక్షల ఆదాయం సంపాదిస్తున్నారు. ఎక్కువగా రూప్‌చంద్, పంగస్ చేపల గుంటలకే వీటిని మేతగా వేస్తుంటారు. ఈ వ్యాపారాన్ని అడ్డుకోకుండా దీని వెనుక ఒక పెద్ద ముఠా ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ ముఠా చేతివాటంతో ఇటు మత్స్యశాఖ, అటు పోలీస్‌లు అడ్డుకోకుండా తతంగం నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి తీసుకువస్తుండడంతో చెరువు వద్దకు చేర్చేసరికి కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజలుతున్నాయి. కొంతమంది (పంగస్ చేపలకు) నేరుగా చేపలకు మేతగా వేస్తుండగా మరికొందరు ప్రత్యేక పాత్రల్లో ఉడకబెట్టి మేతగా వేస్తున్నట్లు సమాచారం. దీంతో చెరువులోని నీరు పూర్తిగా పాడవుతోంది. చేపల చెరువుల నుంచి ఆ నీరు ఊట కాలువలకు విడిచిపెట్టినప్పుడు ఆ కలుషిత నీరంతా సమీపం పంట పొలాల్లో పారుతోంది. కొందరు చికెన్ వ్యర్థాలకు వినియోగించిన డ్రమ్ములను పెన్నానదిలో శుభ్రం చేస్తున్నారు. దీంతో పెన్నా జలాలు, చెరువుల్లో నీరు కలుషితమవుతున్నాయని ప్రజా క్షేమం కోరేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చెరువులో చేపలకు ఆహారంగా వేసిన కోళ్ల వ్యర్థాలు

నియంత్రణ శూన్యం

కోళ్ల వ్యర్థాలు తరలించేవారిపై మత్స్యశాఖ సిబ్బంది నిఘా ఉంచి వాహనాలను పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కానీ ఆ శాఖ అధికారులు సిబ్బంది కొరత పేరుతో పత్తాలేకపోవడంతో పోలీసులు ఇటీవల అడపాదడపా దాడులు చేసి ఒకటో, రెండో చికెన్ వ్యర్థాలు తరలించే వాహనాలను సీజ్ చేస్తున్నారు. గతంలో రాత్రింబవళ్లు తేడాలేకుండా ప్రతినిత్యం కడప వైపు నుంచి సంగం మండలం మీదుగా పదుల సంఖ్యలో వాహనాలు వస్తున్నాయి. కోళ్ల వ్యర్థాల తరలించే వాహనం పట్టుబడితే దీని పర్మిట్‌ను, డ్రైవర్ లైసెన్స్‌ను రద్దు చేయాలి. అంతేగాక వ్యర్థాలను వేసే చెరువుల లైసెన్సును రద్దు చేయాలి. అలా జరగడంలేదు. ఒకవేళ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేస్తే వాహనాలకు కోర్టులో పూచీకత్తు అందజేసి రిలీజ్ చేసుకుని మళ్లీ వ్యర్థాలను తీసుకువచ్చేందుకు వెళుతుండటం గమనార్హం.

అధికారులకు మామూళ్ల మత్తు

చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనదారుల నుంచి కొందరు నెలసరి మామూళ్లు దండుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో చేపల చెరువులు ఉన్న మండలాల పోలీస్ స్టేషన్ పరిధిలో కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనాల నుంచి మామూళ్లు వసూలు చేసి కిందస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు పంచుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కోళ్ల వ్యర్థాలు తరలించే వారి వ్యాపారంతోపాటు చేపల గుంటల యజమానులకు, అధికారుల ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిలుతుందని బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

చెరువులకు కాలువల నీరు

చేపల చెరువులకు అనుమతి ఇచ్చేటప్పుడే బోరుపాయింట్ ఉందా లేదా అని చూసి మత్స్యశాఖ అనుమతి ఇస్తారు. బోరు పాయింట్ ఉంటేనే అనుమతి ఇవ్వాలి. కానీ మామూళ్ల మత్తులో మత్స్య శాఖ ఇవేమి పట్టించుకోకుండా చేపల చెరువులకు అనుమతి ఇస్తున్నారు. దీంతో నిర్వాహకులు పంట పొలాలకు వెళ్లే కాలువలకు మోటార్లు పెట్టి నీటిని నిరంతరం లిఫ్టు చేస్తున్నారు. అయినా ఇరిగేషన్‌శాఖ పట్టించుకోవడం లేదు. సాగు నీరు పుష్కలంగా ఉన్నప్పుడు తోడుకుంటే పర్వాలేదుకానీ సాగునీటి కొరత ఉన్నప్పుడు ఈ చెరువుల వల్ల పంట పొలాల రైతులకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడుతుంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

వ్యాధులు ప్రబలే ప్రమాదం

చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలను వినియోగించడం వల్ల తీవ్రస్థాయిలో దుష్పరిణామాలు తలెత్తుతాయి. ఈ చేపలను తిన్నా, కలుషితమైన నీటి వల్ల శ్వాసకోస వ్యాధులతోపాటు కేన్సర్, ఇన్‌ఫ్లూయంజా, ఫ్లూ వంటి చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.


ఇలాంటి లారీల్లోనే వ్యర్థాలు వచ్చేది!

కఠిన చర్యలు తీసుకోవాలి

కోళ్ల వ్యర్థాల రవాణా నియంత్రణకు అధికారులు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి. లేకపోతే భవిష్యత్తులో ఈ ప్రాంతంలోని చెరువులన్నీ ఎందుకూ పనికిరాకుండా పోయే ప్రమాదముంది. కోళ్ల వ్యర్థాలను తీసుకువచ్చే వారిపైనా, చెరువుల్లో మేతగా వేసేవారిపైనా ఇటు మత్స్యశాఖ, అటు పోలీసు అధికారులు కఠినంగా వ్యవహరించాలి. కేసుల నమోదుతోనే సరిపెట్టడం కాకుండా వ్యర్థాల రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలి.

ఉత్సాహంగా గ్రీన్ ర్యాలీ


గ్రీన్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు

ప్లాస్టిక్ నిషేధం కేవలం నినాదంగా కాకుండా ప్రజలంతా తమ జీవన విధానంలో భాగంగా గుర్తించి సమిష్టిగా కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వీఆర్ కళాశాల నుంచి ఏసీ స్టేడియం వరకు గ్రీన్ ర్యాలీని ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్లాస్టిక్ సంచులు వద్దు - క్లాత్ సంచులు ముద్దు అంటూ చేసిన నినాదాలు మారుమోగాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో హానికరమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిరోధించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూసేజీ ప్లాస్టిక్ బ్యాగులకు బదులు క్లాత్, జ్యూట్ బ్యాగులను వాడాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు 10 వేలకుపైగా చేతి (క్లాత్) సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్, డీసీవో గురప్ప, సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

\- నెల్లూరు (సాంస్కృతికం)

వెన్నుపోటుకు బ్రాండ్ జగనే!

సొంత తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచింది ఆయనే

దమ్ముంటే నా ప్రశ్నలకు జవాబు ఇవ్వండి

నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (వైద్యం) జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోటుకు మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని నుడా చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. గురువారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెన్నుపోటు అనే పదాన్ని ఉచ్చరించే అర్హత జగన్‌కు గాని వైసీపీకి గాని లేదని స్పష్టం చేశారు. జన్మనిచ్చిన తల్లిని, తోడబుట్టిన చెల్లిని వెన్నుపోటు పొడిచిన నేత జగనేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెన్నుపోటు దినానికి పిలుపు నిచ్చిన జగన్ బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చున్నాడంటూ ఎద్దేవా చేశారు. బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డిని గొడ్డలి పోటు పొడిచింది ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉండవల్లి అరుణ్‌కుమార్, వైఎస్ఆర్ ఆత్మ కేవీపీ, సూరీడులను వెన్నుపోటు పొడిచింది ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసనని అన్నారు. ఆస్తి కోసం సొంత చెల్లెలు షర్మిలను ఇంటినుంచి గెంటేసిన వ్యక్తి వెన్నుపోటు గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రౌడీషీటర్లను పరామర్శించేందుకు వెళ్లిన జగన్‌ని రౌటీషీటర్ అనాలా.. శాడిస్ట్ అనాలా అన్ని ప్రశ్నించారు. వైసీపీ ఓ పనికిమాలిన పార్టీ అంటూ దుయ్యబట్టారు. వైసీపీ అభిమానించే నేతలు ఒక్కసారయినా ఉన్నారా అంటూ ప్రశ్నించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని చెప్పారు. వైసీపీకి దమ్ముంటే తాను అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు మామిడాల మధు, పిట్టి సత్యనాగేశ్వరరావు, కువ్వారపు బాలాజీ, తంబి సుజన్‌కుమార్, అంచూరు శ్రీనివాసులనాయుడు, సుభాన్‌బాషా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నది

- ఎస్పీ కృష్ణకాంత్
- ఉద్యోగ విరమణ పొందిన వారికి ఆత్మీయ వీడ్కోలు

నెల్లూరు(క్రైం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోం ప్రతినిత్యం సవాళ్లతో కూడుకున్నదని, సుదీర్ఘకాలం అదేశాఖలో పనిచేసి ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ పొందడం చాలా అదృష్టమని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. పోలీసుశాఖలో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్‌ఐలు వై.విజయకుమార్, కె.జయరాజు, హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్‌డీ.అహ్మద్, ఏ.మాల్యాద్రిలను సతీసమేతంగా గురువారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ జీ.కృష్ణకాంత్ సత్కరించి ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వృత్తి బాధ్యతలలో ఉద్యోగ విరమణ సహజమని, ఇంత నిబద్ధతగా విధులు నిర్వర్తించడానికి వెనక మీ కుటుంబసభ్యుల తోడ్పాటు ఎంతో ఉందన్నారు. విశ్రాంత జీవితంలో ఏ సహాయం కావాలన్నా నేరుగా సంప్రదించవచ్చని, మీకు సహాయం అందించడాని పోలీస్ శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, హోమ్ గార్డ్స్ డీఎస్పీ ఎన్‌వీ రమణ, ఏవో చంద్రమౌళి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్, అసోషియేసన్ నాయకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ సత్కారం అందుకున్న పోలీసు సిబ్బందితో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య, తదితరులు

48 కేజీల గంజాయి పట్టివేత

నెల్లూరురూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి తిరుపతికి కారులో అక్రమంగా తరలిస్తున్న 48 కేజీల గంజాయిని నెల్లూరురూరల్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సీఐ ప్రసన్నలక్ష్మి వెల్లడించారు. తమ సిబ్బంది వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా ఒడిశా ప్రాంతానికి చెందిన శివప్రసాద్ మిషాల్, పూజా మిషాల్, కన్నుప్రసాద్ మిషాల్, బుడుపంగిలు కారులో అనుమానాస్పదంగా కనిపించారన్నారు. దీంతో కారును తనిఖీ చేయగా రెండు సంచుల్లో 48 కేజీల గంజాయి ఉండడాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మొత్తం గంజాయిని ఒడిశాలో రూ.50 వేలకు కొనుగోలు చేసి తిరుపతిలో అధిక ధరలకు విక్రయించేందుకు వెళ్తున్నట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. వీరి నుంచి 192 ప్యాకెట్లలో ఉన్న 48 కేజీల గంజాయి, రూ.5 వేలు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని చెప్పారు. గంజాయి రవాణాపై గట్టి నిఘా ఉందని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు మునీర్ అహ్మద్, శకుంతలదేవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ కాలేషావలి, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

మోటారు బైకుల ఢీ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : నార్త్‌కొండాయపాళెం సమీపంలో ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. దీంతో ఓ మోటారుబైకులో ప్రయాణిస్తున్న నార్త్‌కృష్ణంరాజుపల్లి గ్రామానికి చెందిన వేంపల్లి వెంకటసుబ్బరాజుకు తీవ్ర గాయాలయ్యాయి.

ఇంటర్ జవాబుపత్రాల ట్యాంపరింగ్ వ్యవహారంపై విచారణ

కందుకూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కందుకూరులోని ప్రైవేటు కాలేజీలో జరిగిన ఇంటర్ జవాబుపత్రాల ట్యాంపరింగ్ వ్యవహారంపై గురువారం ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ జయలక్ష్మి విచారించారు. పట్టణంలోని శ్రీ గాయత్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు ట్యాంపరింగ్ కారణంగా నష్టం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించిన ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులు వారిద్దరికీ మార్కులు కలపటంతోపాటు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో జయలక్ష్మి కందుకూరు వచ్చి ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీవివేకా జూనియర్ కాలేజీలో విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, ట్యాంపరింగ్‌కు బాధ్యుడిగా భావిస్తున్న ఇన్విజిలేటర్ కృష్ణారావు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌ను, బాధిత విద్యార్థులను, తల్లిదండ్రులను, బాధిత విద్యార్థుల విద్యాసంస్థ అయిన శ్రీగాయత్రీ కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావును విచారించి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ అందరి స్టేట్‌మెంట్లు రికార్డు చేసినందున విచారణ నివేదిక అందజేస్తానని తదుపరిచర్యలు బోర్డు సెక్రటరీ తీసుకుంటారని తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో సీట్ల కేటాయింపు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సీట్లు కేటాయించామని ఏపీఎస్‌డబ్ల్యూఈఆర్‌ఐ కోఆర్డినేటర్ టీ.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. సీటు వచ్చిన వారికి ఫోన్ ద్వారా మెసేజ్ పంపామని, దాని అధారంగా సంబంధిత గురుకులానికి వెళ్లి సీటు ఖరారు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. సీటు ఖారరు చేసుకోకపోతే సీటును కోల్పోతారని తెలిపారు

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలి

- పర్యావరణాన్ని కాపాడాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు(వైద్యం), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసి పర్యావరణానికి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో వైద్యులు, ఉద్యోగులు పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే ప్రచారంతో పాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కొవడంపై దృష్టిపెట్టామని చెప్పారు. భూమికి కలుగుతున్న కాలుష్యాన్ని ఎలా తగ్గించాలో చర్చిస్తామని, ఏమిచెయ్యాలో ఆలోచిస్తామని, తీర్మానాలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాతావరణ కాలుష్యం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రత్యేకించి గాలి కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు, చర్మవ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 90 శాతం మంది పీల్చే గాలి కాలుష్యం అయిందన్నారు. దీంతో ప్రాణాంతక వాయువులు, ఇతర కణాలు ఉంటాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ కాలుష్యం వల్ల గుండె, మెదడు, చర్మం వంటి భాగాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ భాస్కర్, హుస్సేనమ్మ, డెమో కనకరత్నం, ఏవో నిశాంత్‌రెడ్డి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, వైద్యులు, ఉద్యోగులు

ఆటోను ఢీకొన్న కారు

- ఇద్దరి మృతి.. 9 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషయం
- ఆత్మకూరు సమీపంలో ఘటన

ఆత్మకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు సమీపంలోని ముంబాయి జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వెంకట్రావుపల్లి చెందిన 10 మంది కూలీలో వెళుతున్న ఆటోను కారు ఢీకొనడంతో ఇద్దరు కూలీలు మృతి చెందారు. 9 మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..

వెంకట్రావుపల్లిలోని పది మంది కూలీలు సమీప గ్రామమైనటి ముస్తాపురంలో పొగాకు గ్రేడింగ్ పనులకు ఆటోలో బయలుదేరారు. జాతీయ రహదారిపై ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు వద్ద ఆటో మలుపు తిరుగుతుండగా మర్రిపాడు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీ కొంది. దాంతో కారు ఒకవైపు, ఆటో మరోవైపు పడిపోయాయి. ఆటోలో ఉన్న కూలీలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయారు. షేక్ అజీమా (60), ఆటో యజమాని, డ్రైవర్ దగుమాటి పుల్లారెడ్డి (45) అక్కడికక్కడే మృతి చెందారు. షేక్ గౌసున్నీసా, సలీమా, గౌసున్నీసా, కిలారి వరలక్ష్మి, షేక్ హబీబున్నీసా, షేక్ అన్వర్‌జా, షేక్ రబియాబీ, షేక్ మస్తాన్‌బీ, షేక్ బియాంబీ గాయపడ్డారు. వీరిలో షేక్ సలీమ, షేక్ బియాంబీల పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తరలించారు. మిగిలిన వారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో నారాయణస్వామికి చెవి వద్ద తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న సీఐ జి గంగాధర్, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం, తొమ్మిది మందికి తీవ్రగాయాలవడంతో వెంట్రావుపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.


రోడ్డుపై పడిపోయిన కూలీలు


నుజ్జు నుజ్జు అయిన కారు, ఆటో


మృతుడు పుల్లారెడ్డి (ఫైల్)

మంత్రి ఆనం దిగ్ర్భాంతి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం పట్ల రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

సీఎం, మంత్రి లోకేష్ విచారం

కాగా, ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఇద్దరు మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యశాల సూపరింటెండెంట్ శేషారత్నం, వైద్యసిబ్బందికి సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఫోన్‌లో అధికారులను కోరారు.

అనుకున్నదే జరిగింది!

- 'ఇరిగేషన్'లో రచ్చకెక్కిన ఎల్‌వోసీ యవ్వారం
- ఒకే కాంట్రాక్టర్‌కు మొత్తం బడ్జెట్ కేటాయింపు
- హైకోర్టుకెళ్లిన అవతలి కాంట్రాక్టర్
- అక్కడ తేలేదెప్పుడు.. డబ్బులొచ్చేదెప్పుడు?
- కీలక ప్రాజెక్టుల పనులపై ప్రభావం

నెల్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత క్వార్టర్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పెన్నా రివర్ కెనాల్స్ హెడ్‌కు రూ.17.5 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ మేరకు ఎల్‌వోసీ మంజూరు చేసి బిల్లులు అప్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఈ హెడ్ కింద పెన్నా కాజ్‌వే నిర్మాణ పనులు, డీఆర్-డీఎం ఛానెల్ ఆధునికీకరణ పనులు కీలక దశలో ఉన్నాయి. ఈ రెండు వర్కు లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాజ్‌వేకు సుమారు రూ.23 కోట్ల వరకూ పెండింగ్ ఉండగా, డీఆర్-డీఎం ఛానెల్ పనులకు సుమారు రూ.12 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌వోసీను టీజీపీ సీఈ తొలుత ఈ రెండు వర్కులకు కేటాయించారు. కాజ్‌వే పనులకు రూ.11.5 కోట్లు, డీఆర్- డీఎం ఛానెల్‌కు రూ.6 కోట్లు కేటా యిస్తూ గత నెల 17వ తేదీన ఉత్తర్వు లు ఇచ్చారు. అయితే ఈ కేటాయింపు లపై కాజ్‌వే నిర్మాణ కాంట్రాక్టర్ అభ్యం తరం తెలిపారు. తనకు ఇంతవరకూ ఒక్క రూపాయి బిల్లు రాలేదని, తాను ప్రభుత్వ స్థాయిలో మాట్లాడుకొని ఎల్‌వోసీ తెచ్చుకుంటే, మీరు మరొకరికి ఇస్తే ఎలా అంటూ ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అదే సమయంలో డీఆర్-డీఎం ఛానెల్ కాంట్రాక్టర్ కూడా తాము ఈ ప్రభుత్వంలో పనులు చేశామని, తమకు సగం బిల్లు అయినా ఇస్తే గానీ మిగిలిన పనులు పూర్తి చేయడం సాధ్యం కాదని చెబుతున్నారు. ఈ క్రమంలో సీఈ ఉత్తర్వులు ఇచ్చాక కూడా బిల్లులు అప్‌లోడ్ చేయలేదు. మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద ఈ ఎల్‌వోసీ పంచాయితీ జరిగింది. ఈ క్రమంలోనే గత వారం మొత్తం ఎల్‌వోసీను కాజ్‌వే కాంట్రాక్టర్‌కు కేటాయిస్తూ సీఈ ఉత్తర్వు లను సవరించారు. దీంతో నెల్లూరు సెంట్రల్ డివిజన్ అధికారులు బిల్లు కూడా అప్‌లోడ్ చేశారు. అయితే వివా దం ముగిసిపోయిందని అందరూ అనుకునేలోపు డీఆర్-డీఎం ఛానెల్ కాంట్రాక్టర్ హైకోర్టుకెళ్లారు. తాము పనులు చేశామని, తమకు కేటాయించిన బడ్జెట్‌ను మరో కాంట్రాక్టర్‌కు ఇచ్చేశారంటూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు అడ్మిట్ చేసుకుంది. ఫైనాన్స్, ఇరిగేషన్ శాఖలకు నోటీ సులు అందాయి. దీంతో కాజ్‌వే కాంట్రా క్టర్‌కు డబ్బులు విడుదల చేయడంలో అడ్డంకులు ఏర్పడ్డాయి. హైకోర్టులో కేసు తేలే వరకూ బిల్లు ఇచ్చేందుకు వీలుండ దని ఇరిగేషన్ వర్గాలు చెబుతు న్నాయి. దీంతో ప్రభుత్వం బడ్జెట్ ఇచ్చి నా ఇద్దరు కాంట్రాక్టర్లలో ఏ ఒక్కరికీ దక్కకుండా పోయింది. ప్రస్తుతం రెండు వర్కుల పనులూ నిలిచిపోయాయి. బిల్లులు వస్తే గానీ కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టే సూచనలు కనిపించడం లేదు.

8న అఖిలభారత ఓపెన్ చెస్ పోటీలు

నెల్లూరు(విద్య), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఎస్వీ చెస్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులో ఈ నెల 8వ తేదీన అఖిల భారత ఓపెన్ చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ తెలిపారు. పోటీలు జరిగే నక్షత్ర స్కూల్‌లో గురువారం ఆయన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. విజేతలకు రూ.80వేల నగదుతోపాటు ఇతర ప్రోత్సాహకాలు అందించనున్నట్లు చెప్పారు. ఇక దేశవ్యాప్తంగా వచ్చేక్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కూడా కల్పిస్తున్నా మని చెప్పారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు వంశీకృష్ణ, సుధాశ్రీ, పాఠ శాల డైరక్టర్స్ జీవన్‌కృష్ణ, సంధ్యారెడ్డి, సాయి ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుపై శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): డిజిటల్ లక్ష్మి పథకం ద్వారా కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుపై ఎంపిక చేసిన డీజీ లక్ష్మిలకు గురువారం మెప్మా అర్బన్ సెంటర్‌లో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెప్మా పీడీ లీలారాణి మాట్లాడుతూ డీజీ లక్ష్మిలు సీఎస్‌సీ సెంటర్లను ఏర్పాటు చేసి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఇప్పటి వరకు ఈ పథకంలో 300 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ, మెప్మా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.